మక్క కొనుగోళ్లు చేపట్టండి



వివరాలు 2లో..

# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

పలు గ్రామాల్లో గాలివాన



వివరాలు 2లో..

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం, 07 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

# రైతు డిక్లరేషన్ ..ఓ బోగస్ పత్రం

- రైతులను వంచించిన రేవంత్, రాహుల్
- రైతు భరోసా ఎకరాకు 15 వేలు ఎందుకు ఇవ్వడం లేదు
- రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైంది
- కరోనా కన్నా డేంజర్ కాంగ్రెస్ పార్టీ
- కాంగ్రెస్‌కు పిండం పెడితేనే.. రైతులకు న్యాయం
- బిఆర్ఎస్ హయాంలో ఠంచనుగా రైతుభరోసా ఇచ్చాం
- రైతు సంగ్రామ సదస్సులో కెటిఆర్ విమర్శలు



వరంగల్,మే6 : రైతు డిక్లరేషన్ అనేది ఒక బోగస్ పత్రమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. డిక్లరేషన్ పేరిట రైతులకు చిత్తు కాగితం ఇచ్చి మోసం చేశారని మండిపడ్డారు. డిక్లరేషన్ ఇచ్చిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. హనుమకొండలో నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ.. డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని సూచించారు. రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ జరిగిందా అని అడిగారు. రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. అన్ని పంటలు బోనస్ ఇచ్చి కొంటామన్నారని గుర్తుచేశారు. కౌలు రైతులకు ఎకరానికి రూ.14వేలు వస్తుందా అని ప్రశ్నించారు. పంటబీమా పథకం ఎక్కడకు పోయిందని అడిగారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఎప్పుడిస్తారన్నారు. దుక్కిదున్నే రైతులను దారుణంగా వంచించారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌ది మెగా రైతు మేళా కాదు.. దగా రైతు మేళా అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే డేంజర్ అని సెటైర్ వేశారు. చెడ్డీ గ్యాంగ్ కంటే డేంజర్ కాంగ్రెస్ నాయకులు అని విమర్శించారు. డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో క్రమం తప్పకుండా రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయంలో రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ తీసుకొచ్చిన రైతుబంధు పథకాన్ని 12 రాష్ట్రాలు కాపీ కొట్టాయని తెలిపారు. గతంలో రైతులు పెట్టుబడి కోసం అప్పుల పాలయ్యే వారని గుర్తుచేశారు. రైతులకు 11 విడతలుగా రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. కానీ కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు సమయానికి ఇవ్వడం లేదని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల ముందు ఓట్ల కోసం ఒక్కసారే రైతు భరోసా ఇచ్చారని అన్నారు.డిక్లరేషన్ అమలుకు మిగతా 3లో..

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ



- ప్రభుత్వం మౌనంగా ఉండడం సరికాదు
- రౌండ్ టేబులు సమావేశంలో కవిత

హైదరాబాద్,మే6 : ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. విద్య ద్వారానే సమానత్వం, స్వేచ్ఛ సాధ్యమని కవిత అన్నారు. 'నాణ్యమైన విద్య – ఫీజుల నియంత్రణ'పై ఆమె రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాల భాద్యతేనని నమ్మిన ప్రభుత్వాలు ఉండాలన్నారు. ఫీజులు ఎంత పెంచినా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని చెప్పారు. ఇప్పుడున్న చాలా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో ఉన్నవేపపి, వాటిలో రాజకీయ నాయకులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయన్నారు. . రాజకీయ నాయకులకు విద్యాసంస్థలు ఉండటమనేది సరైనదేనా మనం ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి ఇప్పుడే పరిష్కారం కావాలని అన్నారు. తెలంగాణ వచ్చాక ఫీజుల నియంత్రణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి రిపోర్టు కూడా ఇచ్చింది. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. గురుకులాలు ఏర్పాటు చేశామని.. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోబోమంటే కుదరదు. మన రాష్ట్రంలో 64 లక్షల మిగతా 3లో..

## రైతులు ధైర్యం కోల్పోవద్దు..



- ఆత్మహత్యలకు అస్సలు పాల్పడవద్దు
- కాంగ్రెస్ పాలనలో వేయిమంది రైతులు మృతి
- వారందరికీ పదిలక్షల చొప్పన పరిహారం ఇవ్వాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ మిగతా 2లో..

## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం

- కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో ప్రాజెక్ట్
- ఫేజ్-3కింద ఎయిర్‌పోర్ట్-ఫ్యూచర్ సిటీ కారిడార్
- కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి





న్యూఢిల్లీ,మే6 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. దాదాపు అరగంట పాటు భేటీ అయిన ఇరువురు నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. మెట్రో రెండో దశకు అవసరమైన మిగతా 3లో..

## భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి బాధ్యతల స్వీకారం

### గవర్నర్‌తో మర్యాదపూర్వక భేటీ



హైదరాబాద్,మే6 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లోని 8 వ ఫ్లోర్ లో ఈ బాధ్యతలను చేపట్టారు. శివధర్ రెడ్డి ని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల (నార్కోటిక్స్) నిర్మూలన మరియు రహదారి భద్రత వంటి కీలక అంశాల్లో ఆయన తన అనుభవాలతో సాఫీగా కొనసాగేందుకు సహకరించనున్నారు. ఐపిఎస్ అధికారిగా 32 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ముఖ్యంగా, అంతర్గత భద్రత, మావోయిస్టులను జనజీవన స్రవంతిలో చేర్చే కార్యకలాపాలలో క్షేత్రస్థాయిలో విశేష సేవలందించారు. గతంలో ఇంటిలిజెన్స్ విభాగంతో పాటు పలు కీలక శాఖల్లో సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శివధర్ రెడ్డి రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్సర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం బి.శివధర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో పలువురు మిగతా 3లో..

## సిఎం పర్యటనలతో ట్రాఫిక్ చిక్కులు



- జనాలను ఇబ్బంది పెట్టొద్దన్న సిఎం
- డిజిపి సివి ఆనంద్‌కు ఆదేశాలు జారీ మిగతా 2లో..

## ధాన్యం కొనుగోళ్లపై బిఆర్ఎస్ విష ప్రచారం

- 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచా
- 95 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- పౌరసరఫరాశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి



హైదరాబాద్,మే6 : ధాన్యం కొనుగోలు విషయంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తూ.. రైతులను ఆందోళనకు గురిచేయడంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు అంశంపై ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ గోబెల్స్ ప్రచారం చేస్తూ, రైతులను అయోమయానికి గురిచేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. తమ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరిస్తోందని, రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఈ రబీలో రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. దాదాపు 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగు బడి వస్తుందని అంచనా వేస్తున్నాం. ఇందులో భాగంగా 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం 2.63 లక్షల టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అకాల వర్షాలు, తీవ్రమైన ఎండల (హీట్ వేవ్) నుంచి ధాన్యాన్ని, రైతులను రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు, ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది' అని మంత్రి ఉత్తమ్ అన్నారు. తడిసిన ధాన్యాన్ని ఏం చేయాలి అనేది మిగతా 3లో..

## సీఈసీ నియామకంలో సిజె తొలగింపు కేసు

# విచారణ వాయిదా కుదరదన్న సుప్రీం



న్యూఢిల్లీ,మే6 : కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యత్వాన్ని తొలగించిన కేసుపై సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరింది. కాగా ఈ అప్పీల్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. తాను 'శబరిమలలో మహిళల ప్రవేశం' కేసును పర్యవేక్షిస్తున్నందున ఈ కేసును కొద్ది రోజుల పాటు వాయిదా వేయాలని కేంద్రం తరపు వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానాన్ని కోరారు. కాగా తుషార్ మెహతా అభ్యర్థనను జస్టిస్ దీపాంకర్ దత్త తిరస్కరిస్తూ..ఈ పిటిషన్‌పై విచారణ అత్యంత ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. చాలా రోజుల క్రితమే విచారణ తేదీని ఖరారు చేశామని.. ఇప్పుడు వాయిదా వేయడం కుదరదని స్పష్టం చేశారు. శబరిమల కేసును అసలు విచారించక పోవడమే మంచిదని మంగళవారం 9మంది న్యాయమూర్తుల ధర్మాసనం చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. సీఈసీ, ఈసీ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) స్థానంలో కేంద్ర మంత్రిని తీసుకునేందుకు ప్రతిపాదిస్తూ కేంద్రం చట్టం చేసింది. అయితే ఈ చట్టాన్ని దుర్వినియోగం చేసి కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించుకునే అవకాశం ఉందని పలువురు ఆందోళన లేవనెత్తారు. ఈ చట్టం కింద జరిగిన నియామకాలను సవాల్ చేస్తూ.. సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం వాటిపై విచారణ కొనసాగుతోంది. మిగతా 3లో..

## విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

- 118 మంది ఎమ్మెల్యే మద్దతు తప్పనిసరి
- మద్దతు ఇచ్చే పార్టీల లేఖలు అవసరమని సూచన
- పూర్తి మెజార్టీ ఉంటే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం
- గవర్నర్ విశ్వనాథ్‌తో భేటీలో విజయ్‌కు స్పష్టీకరణ
- నేటి ప్రమాణ స్వీకారంపై సందిగ్ధత



చెన్నై,మే6 : టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాక్ ఇచ్చారు. తగినంత మెజారిటీ చూపించలేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరించారు. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో తక్షణం ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతోంది. మద్దతు ఎమ్మెల్యేలు లేదా పార్టీల జాబితా సమర్పి ంచాలని, అప్పుడే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పలుకుతామని స్పష్టం చేసినట్లు సమాచారం. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలుపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకుంటానని విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. అయితే విజయ్ వివరణతో గవర్నర్ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరం కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి టీవీకే వద్ద ప్రస్తుతం 112 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విజయ్ రెండు సీట్లలో గెలవడంతో ఒక సీటును వదులుకోవడం అనివార్యం. మిగతా 3లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# రైతుల కన్నీళ్లలో రేవంత్ కొట్టుకు పోవడం ఖాయం

### రైతు సంగ్రామ సభలో సత్యవతి రాథోడ్



వరంగల్,మే6 : కేసీఆర్ పాలన రైతాంగానికి స్వర్ణయుగమని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. రైతుబిడ్డగా వ్యవసాయాన్ని పండుగ చేసే విధంగా కేసీఆర్ పాలన కొనసాగిందని అన్నారు. రేవంత్ రెడ్డిది ప్రజాపాలన కాదు రాబందు పాలన అని విమర్శించారు. రైతు కన్నీళ్లలో రేవంత్ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. హనుమకొండలో బీఆర్ఎస్ చేపట్టిన రైతు సంగ్రామ సభలో సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు బాగుండాలంటే మళ్లీ కేసీఆర్ పాలన రావాలని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం ఆగమైందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రెండున్నరేళ్లలో వెయ్యి మంది రైతులు చనిపోయారని తెలిపారు. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యలే అని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి లూదిన గడ్డ వరంగల్ అని తెలిపారు. బీఆర్ఎస్ సభ పెడతామంటే కాంగ్రెస్ ప్రభుత్వం వణికిపోతుందని అన్నారు. కేసీఆర్ జగిత్యాలలో మీటింగ్ పెడితే అదే సమయానికి రేవంత్ రెడ్డి మీటింగ్ పెట్టారని తెలిపారు. కానీ రేవంత్ సభ అట్టర్ ఎ÷-లాప్ అయ్యిందని విమర్శించారు. ఒక్క ఎకరానికి రైతు భరోసా వేసి అలయ్ బలయ్ చేసుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులను పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రైతులకు కేసీఆర్ రూ.72వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. వరంగల్ జిల్లాలో చివరి భూముల వరకు కేసీఆర్ నీళ్లిచ్చారని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాను కేసీఆర్ సస్యశ్యామలం చేశారని అన్నారు.

# టీవీకెకు మద్దతు ఇవ్వడం కాంగ్రెస్ ఇష్టం

### అందుకు తప్పు పట్టాల్సిన అవసరం లేదు

### డీఎంకె ఎంపి కనిమొళి వెల్లడి






చెన్నై,మే6 : తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల అనంతరం కొత్త పొత్తులు చోటుచేసు కుంటున్నాయి. రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ సారథ్యంలో టీవీకే తాజాగా ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమవుతుండటంతో ఆ పార్టీకి కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. దీంతో టీవీకేతో కాంగ్రెస్ పొత్తు ఖరారైంది. ఎన్నికలకు ముందు డీఎంకేతో పొత్తుతో కాంగ్రెస్ పోటీ చేసి 5 స్థానాల్లో గెలిచింది. అయితే ఎన్నికల అనంతరం టీవీకేతో జత కట్టింది. తాజా పరిణామాలపై డీఎంకే ఎంపీ కనిమొళి (ఐజీనితిపనీళితతి) స్పందించారు. తమ భాగస్వామ్య పార్టీలకు ఎవరితో కలిసి వెళ్లాలో నిర్ణయి చుకునే హక్కు ఉందని అన్నారు. 'మేము (కాంగ్రెస్- డీఎంకే) చాలా ఎన్నికలు కలిసి పనిచేశాం. ఇవాళ కూ డా ఎన్నికల్లో కలిసి పోటీచేసి ఓటమి చవిచూశాం. ప్రతి పార్టీ తమకు ఏదైతే సరైనదని అనిపిస్తుందో అది చేసే హక్కు ఉంటుంది. ఇతరుల గురించి నేను చెప్పేమీ లేదు. మేము మాత్రం మా పోరాటం కొనసాగిస్తాం' అని మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కనిమొళి తెలిపారు. ÷ూగస్వామ్యులు ఎప్పుడూ కలిసి ఉండేందుకు డీఎంకే స్టాలిన్ ప్రాధాన్యం ఇస్తుంటారని కనిమొళి చెప్పారు. తమది సైద్ధాంతిక కూటమి అని చెప్పారు. టీవీకే సెక్యులర్ పార్టీగా చెప్పుకోవడంపై అడిగినప్పుడు తమిళనాడులో రాజకీయాల్లో మరో సెక్యులర్ పార్టీ వస్తే తమకు ఎలాంటి భయం లేదన్నారు. డీఎంకే ఓటమిపై మాట్లాడుతూ, ఫలితాలపై తప్ప నిసరిగా డీఎంకే విశ్లేషించుకుంటుందని అన్నారు. ఓటమికి కారణాలు ఇప్పుడే చెప్పలేమని, అయితే వీటిపై విశ్లేషణ చేసుకోవడం చాలా కీలకమన్నారు. తమిళనాడు ప్రజలు మార్పును కోరుకున్నారని, విజయ్‌కు తమ అభినందనలని చెప్పారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారో అలాంటి ప్రభుత్వాన్ని టీవీకే అందిస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. డీఎంకే చాలా ఎన్నికలు చూసిందని, ఎన్నో విజయాలు, మరెన్నో పరాజయాలు చూసిందని, ముందుకు ఎలా వెళ్లాలనేది పార్టీకి బాగా తెలుసునని చెప్పారు. ఈ ఎన్నికల్లో డీఎంకే 234 స్థానాల్లో పోటీచేసి కేవలం 59 సీట్లు గెలుచుకుంది. డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ సైతం కొలత్తూరు కంచుకోటలో ఓటమి చవిచూశారు.

# సిఎం పదవికి హిమంతబిశ్వ శర్మ రాజీనామా



### గవర్నర్‌ను కలిసి రాజీనామా సమర్పణ

గౌహతి,మే6 : అస్సాం ముఖ్యమంత్రి పదవికి హిమంత బిశ్వ శర్మ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యకు అందజేశారు. బుధవారం లోక్ భవన్‌కు వెళ్లిన హిమంత బిశ్వశర్మ.. తన కేబినెట్ సహచరులతో కలిసి రాజీనామా చేశారు. దీంతో బీజేపీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ సీఎం కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. రాజీనామాను ఆమోదించి, కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించే వరకూ శర్మను తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ కోరినట్లు వెల్లడించింది. రాజీనామా అనంతరం లోక్ భవన్ వెలుపల మీడియాతో హిమంత బిశ్వ శర్మ మాట్లాడారు. మే 11 తర్వాత ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇది చరిత్రాత్మక విజయం కావడంతో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. కేంద్ర పరిశీలకుల సమక్షంలో జరిగే బీజేపీ శాసనసభ పక్ష సమావేశంలో కొత్త సీఎంని ఎంపిక చేస్తారని శర్మ తెలిపారు. కాగా, 126 మంది సభ్యులున్న అస్సాం అసెంబ్లీకి ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికలు జరగగా.. మే 4న ఫలితాలు విడుదల అయ్యాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 102 స్థానాలను కైవసం చేసుకుంది.

### రాహుల్, రేవంత్‌లపై వ్యాఖ్యలు

# కెటిఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలి

### మంత్రి సీతక్క డిమాండ్



హైదరాబాద్,మే6 : కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క ఖండించారు. కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని సీతక్క పేర్కొన్నారు. వరంగల్ వేదికగా కెటిఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిజానికి రైతులను బీఆర్ఎస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. బీఆర్ఎస్ హయాంలో పూర్తి రుణమాఫీ జరగలేదు. నాలుగు విడతలతో రైతులను ఇబ్బందులకు గురిచేశారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదు. కానీ, ప్రజా ప్రభుత్వమైన కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చింది. కేసీఆర్ పంట బోనస్ హామీ నెరవేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం పంటలకు బోనస్ ఇస్తోంది. రైతు బంధు నిధుల్లో బీఆర్ఎస్ తీవ్ర జాప్యం చేసింది. మా ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు విడుదల చేసింది' అని మంత్రి సీతక్క తెలిపారు. ఫామ్ హౌస్ పాలనలో రైతులు నష్టపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం కట్టుబడి పనిచేస్తోంది. ప్రజల్లో తిరుగుతున్నాం.. ఫారిన్ టూర్లలో కాదు. సమ్మక్క-సారలమ్మ ఆలయంపై కేటీఆర్ అసత్య ఆరోపణలు చేశారు. కమిషన్ల గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదు. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలి. లేకుంటే అదే ప్రజలు బుద్ధి చెప్తారు' అని సీతక్క వెల్లడించారు.

# సిఎం పర్యటనలతో ట్రాఫిక్ చిక్కులు

### జనాలను ఇబ్బంది పెట్టొద్దన్న సిఎం

### డిజిపి సివి ఆనంద్‌కు ఆదేశాలు జారీ

హైదరాబాద్,మే6 : తన కాన్వాయ్ కారణంగా సామాన్యులకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చూడాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. తన పర్యటనల సమయంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని డీజీపీని సీఎం ఆదేశించారు. ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలిపివేయొద్దని డీజీపీకి సూచించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్టు వద్ద ట్రాఫిక్ జామ్‌పై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్వాయ్ కోసం ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎదురుగా వచ్చే వాహనాలను కూడా ఆపి ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కమిషనర్లతో డీజీపీ సీవీఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాఫిక్‌సమస్యలపై క్షేత్రస్థాయి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం త్వరలో 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటించారు. కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్ పూర్తిగా ఆపకుండా సింగిల్ లైన్‌లో వాహనాలు పంపే ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. రద్దీ సమయంలో ప్రత్యామ్నాయ మార్గాలు ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు డీజీపీ సూచించారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో అప్రమత్తంగా ఉండాలని డీజీపీ ఆదేశించారు. వర్షాకాలం ముందు.. నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బందిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని.. ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ నివారణపై దృష్టి సారించాలన్నారు. ఐఎస్‌డబ్ల్యూ, సీఎస్‌డబ్ల్యూ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల విభాగం కూడా ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం అవ్వాలని అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు.

# రైతులను ముంచి..ఇప్పుడు మొసలి కన్నీరు

### కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ,మే6 : కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ ఖండించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ వ్యాఖ్యలు 'దయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉన్నాయని ఎద్దేవా చేశారు. బుధవారం జరిగిన బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సుపై నాయిని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఒక నకిలీ విత్తనాలు అమ్మే ముఠా అని, వారి హయాంలో 7 వేల మంది రైతులు మరణించారని ఆయన గుర్తుచేశారు. రైతులపై ఎఫ్ఐఆర్ చేయించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని, రైతులను నట్టేట ముంచిన చరిత్ర వారిదని ధ్వజమెత్తారు. ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని రాష్ట్ర సంపదను దోచుకున్నారని ఆరోపించారు. నాయిని రాజేందర్ మాట్లాడుతూ' స్క్రిప్ట్ రాసిస్తే చదవడం కాదు, దమ్ముంటే ఆధారాలతో మాట్లాడాలి.

# రైతులు ధైర్యం కోల్పోవద్దు..

### ఆత్మహత్యలకు అస్సలు పాల్పడవద్దు

### కాంగ్రెస్ పాలనలో వేయిమంది రైతులు మృతి

### వారందరికీ పదిలక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్



వరంగల్,మే6 : రైతులు కాంగ్రెస్ నయవంచనకు బలికావద్దని.. గుండె ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని రైతు సోదరులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని తెలిపారు. రెండేళ్లలో రాబంధు రాజ్యం పోయి.. రైతుబంధు కేసీఆర్ రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతు సంగ్రామ సదస్సులో రైతుల పక్షాన నాలుగు తీర్మానాలు చేస్తున్నామని ప్రకటించారు. కాంగ్రెస్ రాబంధు పాలనలో వెయ్యి మందికిపైగా రైతులు చనిపోయారని.. రోడ్డున పడ్డ ఒక్కో రైతు కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. రైతు సంగ్రామ సదస్సులో చేసిన తీర్మానాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి పంపిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వరంగల్ వచ్చి భద్రకాళి అమ్మవారి మీద ఒట్టుపెట్టి రుణమాఫీ చేస్తానని అన్నాడని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఏ ఊరికైనా వెళ్లి అడుగుదాం.. ఒక్క ఊరిలోనైనా రైతులందరికీ రుణమాఫీ జరిగిందంటే రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ చారానా.. టోపీ బారానా అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రుణమాఫీ పూర్తికాక రైతులు పురుగుల మందు తాగారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో అన్నీ దందాలు, కమీషన్లు, కొట్లాటలే అని విమర్శించారు. రేవంత్ రెడ్డి 69సార్లు ఢిల్లీకి వెళ్లాడని.. కానీ 69 పైసలు కూడా తేలేదని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లి రేవంత్ రెడ్డి కప్పం కడుతున్నాడని తెలిపారు. రాష్ట్రంలో రాహుల్ బంధు నడుస్తుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, ప్రజల గురించి పట్టించుకునే వాళ్లే లేరని అన్నారు. రైతులకు ఇవ్వడానికి పైసలు లేవు.. కానీ రాహుల్ గాంధీకి మాత్రం మూటలు పంపిస్తున్నాడని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులను నంబర్‌వన్ స్థానంలో నిలిపారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆగమైన తెలంగాణను బాగుచేసింది బీఆర్ఎస్ అని తెలిపారు. రైతు ప్రగతికి కేసీఆర్ అద్భుతమైన పథకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ కంటే రైతును బాగా చూసుకున్న నాయకుడు దేశంలోనే లేడని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో రైతు ప్రగతికి విప్లవం సృష్టించామని అన్నారు. పదేళ్లలో రైతులకు రూ.5లక్షల కోట్లు ఖర్చుపెట్టిన నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. కేసీఆర్ హయాంలో సాగు పెరిగి వరంగల్‌లో భూముల రేట్లు పెరిగాయని అన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చాక భూముల ధరలు పడిపోయాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కోసం వానల్లో, ఎండల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్సెట్టిపేట కొనుగోలు కేంద్రంలో గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ వెనుకటి రోజులు వస్తున్నాయని వాపోయారు.

# మక్కులు కొని రైతులను ఆదుకోండి: ఎమ్మెల్యే



జగిత్యాల,మే6 : మీకు పాదాభివందనం చేస్తాం. దయచేసి మక్కలు కొనండి అని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అధికారులను వేడుకున్నారు. కొన్ని రోజులుగా కల్లాల్లోనే మక్కలు పేరుకుపోవడం, వర్షాలకు తడిసి ముద్దవుతుండంతో ఆయన మక్కజొన్న కొనుగోలు చేయాలని మార్క్ ఫెడ్ డీఎంకు ఫోన్ చేసి విజ్ఞప్తి చేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సంజయ్ రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మొక్కజొన్న కొనుగోలు విషయంలో గత నాలుగు వారాలుగా జాప్యం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. లారీలు పంపించండి.. నేను మోస్తా, లేదంటే మా కార్యకర్తలను మోస్తారని అధికారులకు సూచించారు. మీరు అర్జెంటుగా లారీలు పంపించండని ఎమ్మెల్యే కోరారు. ఈ క్రమలో మహిళా రైతులు ఎమ్మెల్యే కాళ్లమీద పడి తమ గోడును వెల్లబోసుకున్నారు.

# పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం



సిద్దిపేట,మే6 : గాలి వాన బీభత్సం సృష్టించడంతో జన జనజీవనం అతల కుతలమైంది. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించడంతో చేతికి వచ్చిన వరి పంట నేల వాలింది. విద్యుత్ స్తంభాలు గాలివానకు కుప్పకూలాయి. రాత్రి నుంచి ఇప్పటివరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామా లు అంధకారంలో ఉన్నాయి. భారీ గాలివాన రావడంతో కొత్తపల్లి,టేంకంపేట, రాంసాగర్ గ్రామాలకు వెళ్లే రహదారిపై భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 11కేవి విద్యుత్తు స్తంభాలు గాలివానకు కిందపడి పోవడంతో పెను ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలో గాలివానకు రేకుల షెడ్లు ఎగిరి రోడ్డుపై పడ్డాయి. వందల ఎకరాల్లో వరి పంట చేతికి వచ్చిన సమయంలో నేలరాడంతో రైతులకు నష్టం జరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో తిరుగుతూ విద్యుత్ పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకుంటున్నారు. కొత్త పల్లి సర్పంచ్ శ్యామల ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో రోడ్డుపై ఉన్న భారీ వృక్షాలను తొలగించి రాకపోకలను సరి చేశారు.

పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించడంతో మండల వ్యాప్తంగా పంటలకు నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# అర్ధరాత్రి వర్షానికి కల్లాల్లో తడిసిన ధాన్యం

జయశంకర్ భూపాలపల్లి,మే6 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వడ్లు, మొక్కజొన్నలు నీటిపాలయ్యాయి. ప్రభుత్వం వడ్లు , మక్కలు కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో రైతులు కల్లాల్లో రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో అకాల వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. జిల్లాలో సుమారుగా 20.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా మల్హర్, మహాదేవపూర్, పలిమెల మండలాల్లో వర్షపాతం నమోదయింది. ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# మక్క కొనుగోళ్లు చేపట్టండి



### నిర్మల్ జాతీయ రహదారిపై రైతుల ఆందోళన

నిర్మల్,మే6 : మొక్కజొన్న, జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతుల ఆందోళన చేపట్టారు. నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లి గ్రామ రైతులు నిర్మల్- బైంసా జాతీయ రహదారిపై బైఠాయించారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే కొనుగోలు కేంద్రాలు లేక పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర లేక, అప్పులు చేసి పండిస్తే తీరా దళారులకు అమ్మాల్సిన దుస్థితి నెలకొందన్నారు. జిల్లా కలెక్టర్ వచ్చి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతుల ఆందోళనతో భారీగా ట్రాఫిక్ జాంమ్ ఏర్పడింది.

# తెలంగాణలో నామినేటెడ్ పోస్టులు భర్తీ

### బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా బస్వరాజు శ్రీనివాస్

హైదరాబాద్,మే6 : తెలంగాణ రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం 17 కార్పొరేషన్లకు చైర్మన్లతోపాటు వైస్ చైర్మన్లను నియమించింది. మరికొన్ని కార్పొరేషన్ల చైర్మన్ల భర్తీని ఈ ఏడాది జులైలో చేపడతామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. బ్రహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా బస్వరాజు శ్రీనివాస్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా బండి రమేశ్ నియమితులయ్యారు. వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్: గట్టు తిమ్మప్ప, యాదవ కార్పొరేషన్ చైర్మన్: రఘునాథ్ యాదవ్, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్: గుంజా రేణుకహ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్: దూడెం వెంకట రమణ, లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్: చరణ్ కౌశిక్,తెలుగు అకాడమీ చైర్మన్: ప్రొఫెసర్ వెంకట రమణ, వాషర్ మెన్ - డాక్టర్ అజయ్ కుమార్ గీత కార్మిక - చంద్ర శేఖర్ గౌడ్,పెరిక - గొంగరి వెంకటేశర్లు,మేర - సంగ వెంకట్ రాజం, మున్నూరు కాపు - బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,పద్మశాలి - గూడూరి శ్రీనివాస్,వెలమ - జువ్వాడి నర్సింగ్‌రావు ఉన్నారు.

# పోలీస్ అధికారినే ఆటపట్టించిన పోకిరీలు

హైదరాబాద్,మే6 : ఆమె ఓ పోలీస్ ఉన్నతాధికారి. ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు స్వయం గా తానే రంగంలోకి దిగింది. ఆవిడే మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి. ఇటీవలే మల్కాజిగిరి సీపీగాఅఖ ÷ూబీపజీబితతి బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం అర్ధరాత్రి కీలక ఆపరేషన్ చేపట్టి సీపీగా కాకుండా సగటు మహిళగా బస్టాండ్‌లో ఒంటిరిగా నిలబడింది. దీంతో అక్కడ ఉన్నది సీపీ సుమతి అని తెలియక సుమారు 40 మంది పోకిరీలు ఆమె చుట్టూ చేరి రకరకాల ప్రశ్నలతో వేధించారు. ఇందులో ఎక్కువ మంది విద్యార్థులే ఉండటం గమనార్హం. ఈ క్రమంలో సీపీ సాధారణ మహిళలు పడే ఇబ్బందులను తాను ఎదుర్కొన్నారు. ఆ తర్వాత అక్కడికి చేరుకున్న పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు.

# నేడు బీహార్ కేబినేట్ విస్తరణ

### మంత్రివర్గంలో నితీశ్ తనయుడు నిశాంత్

పాట్నా,మే6 : బీహార్‌లో ఈనెల 7న గురువారం కీలక మంత్రివర్గ విస్తరణ జరుగనుంది. గాంధీ మైదానంలో పెద్దఎత్తున ప్రమాణస్వీకార కార్యాక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నారు. బిహార్ మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్ మంత్రివర్గంలో చేరే అవకాశం ఉంది. జేడీయూ నేతలు మంగళవారం రాత్రి జరిపిన సమావేశంలో ప్రభుత్వంలో చేరాలని నిశాంత్‌ను ఒప్పించినట్టు తెలుస్తోంది. ఢిల్లీ నుంచి పాట్నా వచ్చిన కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సహా, జేడీయూ నేతలు ప్రస్తుతం 7 సర్క్యులర్ రోడ్డులోని నితీశ్ కుమార్ నివాసంలో సమావేశం జరిపారు. ఈ సమావేశంలో మంత్రుల తుది జాబితాను ఆమోదించనున్నట్టు తెలుస్తోంది. చాలాకాలంగా యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరంగా ఉంటున్న నిశాంత్ ప్రభుత్వంలో చేరేందుకు కూడా తొలుత నిరాకరించారు. అయితే మంగళవారంనాడు జరిగిన జేడీయూ సమావేశంలో సీనియర్ నేతలు ఆయనను ప్రభుత్వంలో చేరేందుకు ఒప్పించినట్టు తెలిసింది. ప్రభుత్వంలో ఆయన చేరడం పార్టీకి, రాష్ట్రానికి కూడా కీలకమని నచ్చచెప్పినట్టు సమాచారం. నిశాంత్ ప్రస్తుతం ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు, నితీశ్ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల ఫీడ్‌బ్యాక్‌ను సేకరించేందుకు పలు జిల్లాల్లో 'బిహార్ గుడ్‌విల్ యాత్ర' జరుపుతున్నారు. ఆయన గత మే 8న లాంఛనంగా జేడీయూలో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా ఆయనకు సభ్యత్వాన్ని అందజేశారు. కాగా, బిహార్ మంత్రివర్గ విస్తరణలో 27 మందికి చేటు కల్పించనున్నారు.

## (మొదటిపేజీ తరువాయి)

## రైతు డిక్లరేషన్ ..ఓ బోగస్ పత్రం

రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని కేటీఆర్ అన్నారు. రైతన్నలు కాళ్లు పట్టుడు బంద్ చేసి.. కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టాలని సూచించారు. దండం పెట్టడం కాదు.. కాంగ్రెస్ పార్టీకి పిండం పెట్టండి.. అట్లయితేనే రైతులకు మంచి రోజులు వస్తాయని అన్నారు. తాలు తీస్తే రైతులు నీ తోలు తీస్తారని సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. మక్కలు కొనకపోతే నీ ప్రభుత్వం వెయ్యి ముక్కలవుతుందని వార్నింగ్ ఇచ్చారు.సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారని కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కనపడితే రైతుబంధు ఇంకా ఎప్పుడు ఇస్తారని కాలర్ పట్టుకుని నిలదీయాలని హెచ్చరించారు. రూ. 50వేల కోట్ల రుణమాఫీ చేస్తానని సీఎం చెప్పారని.. కానీ రూ. 12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని ధ్వజమెత్తారు. ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు... ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ సెటైర్లు గుప్పించారు. కాంగ్రెస్ నేతలకు రైతన్నల ప్రతాపం చూపించే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యూవల్ సీఎం అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ఒక్క ఊరిలోనైనా సంపూర్ణంగా చేసిందని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఈ సవాల్‌ను రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు స్వీకరిస్తారో చెప్పాలని అన్నారు. సమ్మక్క - సారలమ్మ జాతరలో రూ.70 కోట్ల విషయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను దండుపాళ్యం బ్యాచ్‌లా రేవంత్‌రెడ్డి అండ్ కో దోచుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఇన్నాళ్లూ చేసినవి తప్పుడు ఆరోపణలని తేలి పోయిందని.. ఇకపై ఆరోపణలు చేస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. మేడిగడ్డను కాంగ్రెస్ నేతలు బాంబులు పెట్టి పేల్చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల కొనుగోలు తెలుసు... ధాన్యం కొనుగోలు తెలియదని ఎద్దేవా చేశారు. బస్తాల్లో డబ్బులు మోసేది తెలుసు.. యూరియా బస్తాలు ఇచ్చేది తెలియదని కేటీఆర్ విమర్శించారు. కేంద్రంలో బడేభాయ్ చెప్పినట్లుగా.. రాష్ట్రంలో చోటేభాయ్ ఆడుతున్నారని సెటైర్లు గుప్పించారు. రాహుల్‌గాంధీ గతంలో వరంగల్ వచ్చి రైతు డిక్లరేషన్ పేరుతో సభ పెట్టారని ప్రస్తావించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నాడు మాట్లాడిన స్పీచ్ సభలో ప్రదర్శించామని.. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో 34హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఒక్క హామీ కూడా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఇక్కడ రైతు సదస్సు పెడితే అక్కడ మైగా రైతు మేళా పెట్టారని ఎద్దేవా చేశారు. అన్నదాతలందరికీ రైతు బీమాను ఇవ్వని దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు.

## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం



అనుమతులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకున్నట్టు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెట్రో రెండో దశ డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని, శంషాబాద్ ఎయిర్‌పోర్టు-ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్-3 కింద చేపట్టాలని కోరారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్-2సమగ్ర ప్రణాళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ మెట్రో ఫేజ్-2, మెట్రో ఫేజ్-3పై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం వివరించారు. ప్రస్తుతం ఫేజ్-1 ప్రభుత్వం పరిధిలో ఉండడంతో విస్తరణ సులువవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్-2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 ప్రాజెక్ట్ ను భారత ప్రభుత్వం ? తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ ,భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్-3గా చేపట్టాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-ఎఎఎ కిసంబంధించిన డీపీఆర్ ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా సలహాదారుగా

## శివధర్ రెడ్డి బాధ్యతల స్వీకారం

ఐపిఎస్ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ సిపి వి.సి.సజ్జనార్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి శ్రీ విజయ్ కుమార్, మల్కాజిగిరి సిపి బి.సుమతి, ఐజిపి(పీఅండ్ఎల్) గజరావు భూపాల్‌తో పాటు ఇతర ఉన్నతాధి కారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ, పోలీసు విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై బిఆర్ఎస్ విష ప్రచారం

కూడా అధికారులకు సూచనలు చేశామని అన్నారు. ప్రతి కొనుగోలు సెంటర్లలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. ధాన్యం కొనుగోలుకు సంబంధించి సివిల్ సప్లై భవన్ లో కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి రోజు వెదర్ అలర్ట్ అన్ని కొనుగోలు సెంటర్లకు అందిస్తున్నామని..తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే రాష్ట్రంలో ఎక్కువ కొనుగోలు సెంటర్ల ను ఏర్పాటు చేశామని... బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కంటే కాంగ్రెస్ హయంలో ఎక్కువ మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ఏ రైతుకు ఇబ్బంది వచ్చిన కంట్రోల్ సెంటర్ కు పిర్యాదు చేయొచ్చని అన్నారు. కేటీఆర్ ధాన్యం కొనుగోలు విషయంలో అవగాహన రహితంగా మాట్లాడుతున్నారని.. బీఆర్ఎస్ కు ఇప్పటికే ప్రజలు బొంద పెట్టారని మంత్రి ఉత్తమ్ అన్నారు.

## విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

దీంతో టీవీకే చేతిలో 107 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నట్టయింది. కాంగ్రెస్ బలం కూడా కలిపితే టీవీకే బల నిరూపణకు మరో 6 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఐడీఎంకే 47 సీట్లలో గెలవగా, అందులోని ఒకవర్గం టీవీకే వైపు మొగ్గుచూపుతోంది. పీఎంకే-4, ఐయూఎంఎల్-2, సీపీఐ-2, సీపీఎం-2, డీఎండీకే, ఐఎంఎంకే చెరో సీటు కలిగి ఉన్నాయి. టీవీకేకు చిన్న పార్టీల నుంచి మద్దతు లభించే అవకాశాలు బలంగానే ఉన్నాయి. అయితే అధికారికంగా మద్దతు ఇస్తేనే సంఖ్యాబలాన్ని విజయ్ చూపించుకునే అవకాశం ఉంటుంది. టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కాగా, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా ఈనెల 7వ తేదీన విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ఏర్పాట్లు కూడా చేసుకున్నారు.. మంచి ముహూర్తం కావడంతో ఉదయం 10 గంటల నుంచి 11.15 గంటల మధ్య విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 5,000 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసి ఉదయం గురువారం 6 గంటల కల్లా సిద్ధం చేయనున్నట్టు టీవికే వర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం కావడంతో స్టేడియం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ

మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలి. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే ఇవ్వాలి. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్‌లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు? ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా అని కవిత ప్రశ్నించారు.

# బందరు చరిత్ర తిరగరాసేలా అభివృద్ధి

**పట్టణంలో అన్ని ప్రాంతాలకు మంచినీటి సరఫరా**

**మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ**





**మచిలీపట్నం,మే6 :** బందరు చరిత్ర తిరగరాసేలా అభి వృద్ధి చేసి చూపిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మచిలీపట్నంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్లు మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. బుధవారం బందరులో తాగునీటి పైపులైన్లు, డీడబ్ల్యూఎమ్ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బందరులోని ప్రతి ప్రాంతానికి రోడ్లు, తాగునీటి సౌకర్యాలు అందించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆరోపణలు, విమర్శలు తప్ప మాజీ మంత్రి పేర్నినానికి బందరు అభివృద్ధి పట్టదని విమర్శించారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటే తొక్కి పడేస్తామని కొల్లు రవీంద్ర వార్నింగ్ ఇచ్చారు. గతంలో రోడ్లను కూడా పట్టించు కోలేదని వైసీపీపై మంత్రి విరుచుకుపడ్డారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక గుంతలు లేని మచిలీపట్నాన్ని సాకారం చేశామన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.28 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించామని తెలిపారు. గతంలో ఎంపీగా పని చేసిన కొనకళ్ల నారా యణ రావు, ప్రస్తుత ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషితో కేం ద్రం నుంచి నిధులు వచ్చాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు సమకూర్చి మున్సిపా లిటీలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇళ్ల నిర్మా ణ ప్రాంతంలో ఇనుము దొంగిలించేశారంటూ పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ.. ఆధారాలు చూపించమంటే తేలుకుట్టిన దొంగల్లా పారిపోతున్నారని మండిపడ్డారు. మార్కెట్ యార్డులో పెట్టిన ఇనుము పాడైపోతుంటే.. దాన్ని వేరే ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం కోసం వినియోగించడం లో తప్పేముందని ప్రశ్నించారు. తప్పు జరిగితే ఫిర్యాదు చేయాలని.. కానీ అధికారులను బెదిరించడం దుర్మార్గమని మండిపడ్డారు. 2014-19 మధ్య పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను గత ఐదేళ్లు లబ్దిదారులకు అందకుండా పాడుబెట్టారని మంత్రి ఆరోపించారు. కరగ్రహారం లే అవుట్ పేరుతో వైసీపీ నాయకులు పేదల భూములను తక్కువ ధరకు కొని ప్రభుత్వానికి అధిక ధరకు అమ్మి లాభాలు పొందారని వ్యాఖ్యానించారు. ఇళ్లు కట్టుకోవడానికి కూడా పనికిరాని ప్రాంతాల్లో భూ కేటాయింపుల పేరుతో దోచుకున్నారని తెలిపారు. ఆ లే అవుట్లలో రోడ్లు, తాగునీటి సౌకర్యాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని పేర్ని నాని, జగన్ రెడ్డిని ప్రశ్నించారు. పేర్నినాని రోజూ మీడియా ముందుకు వచ్చి చెత్త ఆరోపణలు చేయడం తప్ప అభివృద్ధి కోసం ఒక్క ఆలోచన కూడా చేయలేదని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

## నేర సామ్రాజ్యానికి అధినేత జగన్

**ప్లానెట్ కిల్లర్స్ ఫారెస్ట్ డెస్ట్రాయిర్‌లో**

**వైసిపి నేరచరిత్ర**

**టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ**



**అమరావతి,మే6 :** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. కిల్లర్, క్రిమినల్, మాఫియా పార్టీలకు అధ్యక్షుడని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విమర్శించారు. గొడ్డలి పార్టీ నేరాలు ప్రపంచ స్థాయికి ఎక్కాయన్నారు. వైఎస్ జగన్ అనుచరుడు.. ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డి అరాచకాలు అన్నీ వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి ఇన్వెస్టిగేటివ్ ఛానల్ జావా డిస్కవర్ విడుదల చేసిన ప్లానెట్ కిల్లర్స్ ఫారెస్ట్ డిస్ట్రాయర్ డాక్యుమెంటరీలో వైసీపీ నేర చరిత్ర అంతా బయట పడిందని విమర్శించారు.బుధవారం రాజధాని అమ రావతిలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విలేకర్లతో మాట్లాడుతూ..2003లోసీఎం నారా చంద్రబాబుపై అలిపిరి క్లేమోర్ మైన్ దాడిలో ఈ కొల్లం గంగిరెడ్డి నిందితుడిగా ఉన్నాడని గుర్తు చేశారు. వైఎస్ జగన్ బాబాయి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కూడా అతడు ప్రధాన నిందితుడిగా ఉన్నారని చె ప్పారు. అలాంటి వ్యక్తులతో వైఎస్ జగన్ అంటకా గుతున్నారని మండిపడ్డారు. 30 క్రిమినల్ కేసులు ఉన్న జగన్ రెడ్డి, 27 కేసులు ఉన్న కొల్లం గంగిరెడ్డి బెయిల్‌పై బయట తిరుగుతున్నారని వివరించారు. జగన్ సహవాసం అంతా ప్రపంచ స్థాయి స్మగ్లర్లు, నేరస్తులతోనే అని ఆమె వ్యంగ్యంగా అన్నారు. సీఎం చంద్రబాబు ప్రపంచ స్థాయి కంపెనీలను ఆకర్షి స్తుంటే.. వైఎస్ జగన్ స్మగ్లర్లు, నేరస్తులతో చెట్టపట్టాల్ వేసుకుని తిరుగుతున్నారని టీడీపీ ఎమ్మె ల్సీ అనురాధ తెలిపారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌లో వాడే గొడ్డళ్లన్నీ ఇడుపులపాయి నుంచే వెళ్లాయని ఆరోపించారు. జగన్ రెడ్డి విజయవాడ, తాడేపల్లి వదిలి బెంగళూరులో కూర్చొని నేరాలు, ఘోరాలకు స్కెచ్‌లు వేస్తున్నట్లుగా తమకు అనుమానం కలుగుతోందన్నారు. వైసీపీలో ఏ నాయకుడి వెనుక చూసినా నేర చరిత్ర ఉంటుందని పంచుమర్తి అను రాధ ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకా చాలా మం ది వైసీపీ నాయకుల నేర చరిత్రలు జావా డిస్కవ రీలోకి వస్తాయని పేర్కొన్నారు. వైసీపీని గొడ్డలి పార్టీ అంటారా? అంటూ ఆ పార్టీకి చెందిన మహిళా నేత వాపోతోందన్నారు. వివేకానందరెడ్డిని గొడ్డలితో ఏడుసార్లు నరికి దారుణంగా హత్య చేశారని తెలిపారు. అలాంటి పార్టీని గొడ్డలి పార్టీ అనక మరేమంటారు? అని ఈ సందర్భంగా వైసీపీ నేతలకు ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ చురకలంటించారు.

## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

**సిఎం అభ్యర్థిపై బిజెపిలో సమాలోచనలు**

**ప్రమాణస్వీకారానికి భారీగా ఏర్పాట్లు**



**కోల్‌కతా,మే6 :** పశ్చిమ బెంగాల్‌లో స్పష్టమైన ఆధిక్యం సాధించడంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే అంశంపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో వరుసగా చర్చలు జరుపుతోంది. దీనిపై కసరత్తు జరుగుతుండగానే 9న ప్రమాణ స్వీకార ఏర్పాట్లు సాగుతున్నారు. బెంగాల్ నేత ఎంపికకు పరిశీలకుడిగా కేంద్రహోంమంత్రి అమిత్ షా రానున్నారు. అందుకే మే9వతేదీ శనివారం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య బుధ వారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లోఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసనసభా పక్ష సమావేశం జరుగుతుందని సమిక్ భట్టాచార్య తెలి పారు. ఈ సమావేశంలో శాసన సభా పక్ష నేతను పార్టీ ఎమ్మెల్యేలు అంతా కలిసి ఎన్నుకుం టారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్రం మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్య మంత్రులు, ఎన్డీయే నాయకులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కార్యక్ర మానికి పార్టీ సీని యర్ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా కొలువుదీరనున్న మంత్రి వర్గం లో దాదాపు 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయ కత్వం చెబుతుంది. మరోవైపు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికే దృష్టి కేంద్రీకరించారు.

## ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం

**విధులకు ఏళ్లుగా గైర్హాజరు**

**51 మందిపై వేటు వేసిన ప్రభుత్వం**

**క్రమశిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదన్న**

**మంత్రి సత్యకుమార్**

**అమరావతి,మే6 :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న వైద్యుల పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేస్తూ.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని 51 మంది వైద్యులను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ప్రకటించారు. శాశ్వత ఉద్వాసనకు గురైన 51 మందిలో బోధనాసుపత్రులకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు 8 మంది, అసిస్టెంట్ ప్రొ ఫెసర్లు 41 మంది, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారు. వీరితో పాటు మరో ముగ్గురు ప్రొఫెసర్లపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవు తోంది. తొలగించిన వారిలో కొందరు ఏడేళ్ల నుం చి, మరికొందరు ఆరేళ్ల నుంచి విధులకు దూరంగా ఉంటూ సొంత వ్యాపకాలు సాగిస్తున్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్-1964 ప్రకారం ఏడాదికి మించి విధులకు గైర్హాజరైతే రాజీనామా చేసినట్లుగానే పరిగణించే అధికారం ప్రభుత్వానికి ఉంది. నిబంధనల మేరకు వీరికి ముందస్తుగా షోకా జ్ నోటీసులు జారీ చేసి, వివరణ ఇవ్వడానికి తగిన సమయం ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఏడాదిలోపు గైర్హాజరీలో ఉన్న మరో 33 మంది వైద్యులు ఇందులో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఛార్జిమెమోలు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా విధుల్లో చేరని పక్షంలో వీరిని కూడా విధుల నుంచి తొలగించనున్నట్లు హెచ్చరించారు. ప్రభుత్వ హెచ్చరికలతో ఇప్పటికే 11 మంది వైద్యులు తిరిగి విధుల్లో చేరారు. వైద్యుల బాధ్యతారాహిత్యాన్ని ఏమాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. త్వరలోనే మరో ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా ఇటు వంటి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విధులకు గైర్హాజరైన వారిలో కాకుండా, మరో 33 మంది వైద్యులకు ప్రభుత్వం ఛార్జిమెమోలు జారీ చేసింది.

## ప్రజాసంక్షేమం లక్ష్యంగా టిడిపి పాలన

**మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**ఒంగోలు,మే6 :** ప్రజాసంక్షేమం, సామాజిక న్యాయం కోసం టీడీపీ పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాం జనేయ స్వామి పేర్కొన్నారు. టీడీపీ ఆవిర్భావంతోనే సమాజంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసి జగన్ ప్రజ లను మోసం చేశారని ధ్వజమెత్తారు. జగన్ చేసిన మోసాన్ని వైసీపీ నేతలే స్వయంగా ఒప్పుకున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విలువలు లేని పార్టీ వైసీపీ అని ఎద్దేవా చేశారు. బుధవారం ఒంగోలులో టీడీపీ పార్లమెంట్ నూతన భవనానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి డీబీవీ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే ఉగ్ర నం˘సిం హారెడ్డి, ఉమ్మడి జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, నేతలు పాల్గొ న్నారు. మంత్రి డీబీవీ స్వామి మాట్లాడారు.దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు వేసిన పునాదులతో 44 ఏళ్ల నుంచి టీడీపీ జెండా రెపరెపలాడుతోందని మంత్రి ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ చంద్రబాబు, లోకేశ్ పార్టీని మరింత బలోపేతం చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

## మైనార్టీల సంక్షేమానికి పెద్ద ఎత్తున చర్యలు

**మైనారిటీల అభివృద్ధికి రూ.1000 కోట్లు**

**మైనార్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ మహ్మద్ నసీర్**

**అమరావతి, మే6 :** రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మైనార్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ మహ్మద్ నసీర్ స్పష్టం చేశారు. బుధవారం రాజధాని అమరావతిలోని ఏపీ అసెంబ్లీలో మైనార్టీస్ సంక్షేమ కమిటీ చైర్మన్ మహ్మద్ నసీర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహ్మద్ నసీర్ మాట్లాడుతూ.. విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో మైనా రిటీలకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. పీఎంజేవీవై కింద రూ.275 కోట్ల నిధుల విడుదల చేసినట్లు చెప్పారు. మైనారిటీల అభివృద్ధికి రూ.1000 కోట్ల డీపీఆర్‌లు సిద్ధం చేశామని పేర్కొన్నారు. గుంటూరు, నంద్యాలలో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇమామ్, మౌజన్ల బకాయి గౌరవ వేతనాల విడుదల చేసినట్లు ఆయన వివరించారు. అర్హులైన వారికి కొత్తగా గౌరవ వేతనాల ప్రతిపాదనలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రార్థనా లయాలకు పొజిషన్ సర్టిఫికెట్స్‌పైనా చర్యలు తీసుకుంటామన్నారు. ముస్లిం మహిళల సాధికారతకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. మైనారిటీలలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం రూ.20 కోట్ల నిధులు కేటాయించామన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని చైర్మన్ మహ్మద్ నసీర్ తెలిపారు. మైనారిటీ హాస్టళ్లలో ఖాళీల భర్తీపై చర్యలు తీసుకుంటామన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలపై త్వరలో సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. వ్యవసాయం, విద్య, ఉపాధి రుణాలకు ప్రాధాన్యం ఇవ్వలని ప్రభుత్వాన్ని కోరుతా మన్నారు. బీసీ-ఈ దూదేకుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిం చామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీలో ఉర్దూ టీచర్ల నియామ కంపైనా చర్చించామని చెప్పారు. అన్ని రంగాల్లో మైనారిటీలకు సమాన భాగస్వామ్యం కల్పించడమే తమ కమిటీ లక్ష్యమని ఆయన వివరించారు. మైనారిటీల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని మైనారిటీ సంక్షేమ కమిటీ చైర్మన్ నసీర్ వివరించారు.

## పాపికొండలు యాత్రకు తాత్కాలిక బ్రేక్



**రాజమండ్రి,మే6 :** రెండు తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు అధికారులు సూచన చేశారు. గోదావరి నదిలో అత్యంత ఆదరణ పొందిన 'పాపికొండలు విహారయాత్ర' ను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు జలవనరుల శాఖ ప్రకటించింది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండటంతో పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాపికొండలు యాత్రను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, పర్యావరణం అనుకూలించిన తర్వాతనే విహారయాత్రను పునరుద్ధరిస్తామని యంత్రాంగం వెల్లడిం చింది. యాత్ర పునఃప్రారంభానికి సంబంధించిన తదుపరి వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని, అప్పటివరకు పర్యాటకులు అధికారులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నదీ ప్రవాహంలో ప్రమాదాలు జరగకుండా ముందుజాగ్రత్తగా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## సంపాదకీయం

# ప్రజల ఆకాంక్షలను బిజెపి గౌరవించాలి !

దేశంలో అత్యధిక రాష్ట్రాలు ఇప్పుడు బిజెపి ఖాతాలో పడ్డాయి. మోడీ నామజపంతో పొంగిపోకుండా ప్రజలకు మార్పును చూపాలి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలకు పరిష్కారం దక్కాలి. విద్య,వైద్యం,ఉపాధి రంగాలకు పెద్దపీట వేయాలి. బిజెపి రావడం వల్లనే ఈ సమస్యలు పరిష్కారం అయ్యాయని ప్రజలు చర్చించాలి. అప్పుడే మార్పు సాధ్యం అవుతుంది. ఇకపోతే మిగతా రాష్ట్రాల్లో ఎలా ఉన్నా..బెంగాల్లో సరిహద్దులకు కంచె వేస్తామన్న బిజెపి హామీ నెరవేర్చాలి. ఇందుకు తక్షణం నడుం బిగించాలి. అలాగే చొరబాటుదారులను గుర్తించి నిర్దాక్షిణ్యంగా ఏరి పారేయాలి. ఎందుకంటే చొరబాటుదారులు స్థానిక ప్రజలను మించి, పెత్తనం సాగిస్తున్నారు. ఊరూరా జల్లెడ పట్టి వారిని గుర్తించాలి. రోహింగ్యాల విషయంలో ఎలాంటి క్షమాగుణం అవసరం లేదు. భారతదేశం ధర్మసత్రం కాదన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే ఇందుకు కార్యాచరణ సిద్దం చేయాలి. బెంగాల్‌తో పాటు అసోం, ఈశాన్య రాష్ట్రాలను జల్లెడపడితే తప్ప స్థానికంగా గొడవలు సద్దుమణగవు. ఒక్కొక్కరిని గుర్తించి, వారి ఆధార్, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు వంటివన్నీ లాగేసుకుని సరిహద్దు దాటించాలి. అలాగే సరిహద్దు కంచెపైనా నిర్ణయం తీసుకోవాలి. ఇవే సమస్యలపై బిజెపి పోరాడింది కనుక ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రథమ కర్తవ్యం ఇదే కావాలి. యావద్భారతంలో ఆసక్తి రేకెత్తించిన ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే ప్రజలు మార్పును కోరుకున్నారు. బెంగాల్లో మమతా బెనర్జీ 15 ఏళ్ల రాక్షస పాలనను ప్రజలు తమ ఓటుహక్కుతో తిరస్కరించారు. ఇకపోతే తమిళనాటు విజయ్ గెలవడం ఓ సంచలనమే. ఆయన హామీలు గుప్పించారు. తెలుగు రాష్ట్రాల్లో లాగా బంగారం, మహిళలకు నెలనెలా పెన్షన్ లాంటి చెల్లింపులు తదితర హామీలు గుప్పించారు. ద్రవిడ పార్టీల ఆధిక్యాన్ని సవాలు చేస్తూ.. తమిళనాట సినీ హీరో విజయ్ అరంగేట్రంలోనే అదరగొట్టడంలో హామీల బుట్ట కూడా ఉంది. సినీ ఛరిష్మాకు తోడు, హామీలు కూడా కలసి వచ్చాయి. కనుక గత పాలకుల వైఫల్యాలను ముందు పెట్టుకుని విజయ్ నడుచుకుంటేనే నిలదొక్కుకోగలరు. కేరళలో యూడీఎఫ్ మళ్లీ పీఠమెక్కడంతో.. కామ్రేడ్లకు ఇక దేశంలో ఎక్కడా స్థానం లేకుండా పోయింది. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు బెంగాల్, త్రిపుర, కేరళలో అవకాశాలు లేనట్లుగానే భావించారు. ఇది వారి స్వయంకృతమనే చెప్పలి. నేలవిడిచి సాము చేయడం కమ్యూనిస్టులకు అలవాటు. కేరళలో కూడా అదే జరిగింది. పదేళ్ల పినరయ్ విజయన్ అధికారంలో కేరళలో గణనీయమైన మార్పులు గోచరించ లేదు. అస్సాంలో కమలం ముచ్చటగా మూడోసారి జయభేరి మోగించారు. పుదుచ్చేరిలో మళ్లీ సామాన్యుడికే పీఠం దక్కింది. అస్సాం, పుదుచ్చేరి తప్పిస్తే... అంతటా ఓటర్లు మార్పునే కోరుకున్నారు.భారత ప్రజాస్వామ్యంపై నమ్మకం కల్పించిన రోజిది. మన రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థలు విజయం సాధించాయి. అని ప్రధాని మోడీ ప్రకటించుకున్నారు. ఒక్కో రాష్ట్రం బిజెపి ఖాతాలో పడుతున్న వేళ ప్రజలకు మేలైన పాలన దిశగా బిజెపి కృషి చేయాలి. లేకుంటే ఈ ఆనందం ఆవిరి కావడానికి కూడా సమయం పట్టదు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు కమలం వికసించిందన్న ప్రధాని మోడీ, ప్రజల ఆకాంక్షలను కూడా పట్టించుకోవాలి. దేశంలో అనేకానేక సమస్యలు ఉన్నాయి. వాటిపై కమలనాథులు దృష్టి సారించాలి. ఇద్దరు ముఖ్యమంత్రులు స్టాలిన్, మమతా బెనర్జీ తాము పోటీ చేసిన స్థానాల్లో ఘోర పరాజయం పాలయ్యారు. ఆయా రాష్ట్రాల్లో పలువురు మంత్రులు మట్టికరిచారు. భవానీపుర్‌లో పోటీ చేసిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ప్రత్యర్థి, ప్రతిపక్ష భాజపా నేత సువేందు అధికారి చేతిలో ఘోర పరాజయం పాలయ్యారు. ఆమెతోపాటు దాదాపు 20 మంది మంత్రులు ఓడిపోయారు. సువేందు అధికారి రెండు చోట్లా విజయం సాధించారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో మమతా బెనర్జీ తీవ్ర అసహనానికి గురయ్యారు. చివరి వరకూ వేచి ఉండాలని, విజయం తమదేనని మధ్యాహ్నం సమయంలో వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. అయితే సాయంత్రానికి తృణమూల్ పరాజయం పరిపూర్ణమైంది. రాజకీయాల్లో కక్షలు కార్పణ్యాలు తగవు. ప్రజలను ప్రజలుగా చూడలేని వారు అధికారానికి అనర్హులు. బెంగాల్లో ప్రజలకు గత పదిహేనేళ్లుగా స్వేచ్ఛ లేకుండాపోయింది. బెంగాల్ విజయంతో భాజపా స్వతంత్రంగా పాలించే రాష్ట్రాల సంఖ్య 15కు చేరనున్నాయి. అదనంగా బిహార్‌లో జేడీయూ, ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా, నాగాలాండ్‌లో నాగా పీపుల్స్ ఫ్రంట్, మేఘాలయ లో నేషనల్ పీపుల్స్ పార్టీ తదితరాలతో కలిపి భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య 21కి చేరుతోంది. దాదాపు 75శాతం రాష్ట్రాలు బిజెపి గుప్పిట ఉన్నట్లే. కనుక పాలనలో మార్పు కనిపించాలి. ప్రజలకు బిజెపి పట్ల అనురాగం పెరగాలి. ఇజెపికి ఓటేసినందుకు ప్రజలు ఆనందపడాలి. అందుకు అనుగుణంగా పాలనా పరమైన మార్పులు రావాలి. రాజకీయ పందురాలకు, ఉచిత పథకాలకు దూరంగా ఉండాలి. పన్నుల రూపంలో వచ్చే డబ్బులను అభివృద్ధికే వినియోగించాలి. అప్పుడే బిజెపిని మరోమారు ప్రజలు నమ్ముతారు. అందుకు కఠినమైన నిర్ణయాలకు కూడా వెనకాడరాదు.

# రవీంద్రుని జయంతి రోజు ప్రమాణస్వీకారం



- కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై బిజెపి స్పష్టత
- సిఎం అభ్యర్థిని ఎంపికచేయనున్న అధిష్టానం

కోల్‌కతా,మే6 : పశ్చిమబెంగాల్‌లో మే 9న భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య వెల్లడించారు. నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆ రోజున నూతన సీఎం ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. ఠాగూర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఒక కొత్త ఆరంభానికి నాంది పలకడానికి ఈ తేదీని నిర్ణయించామన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన పనులు చేస్తున్నామన్నారు. కాగా బెంగాల్ ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. బెంగాల్ ఎన్నికల ఫలితాల అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఈసీ ఉన్నతాధికారులు.. ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్‌కు అందజేయ నున్నారు. బుధవారం ఈ అధికారిక పత్రాలను సీఈసీ.. గవర్నర్ ఆర్.ఎన్.రవికి ఇస్తారు. అనంతరం ఆయన రాజీనామా సమర్పించాల్సిందిగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఆహ్వానిస్తారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసేవరకు మమత తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. ఇదిలావుంటే బెంగాల్‌లోని అసన్‌సోల్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా మూసిఉన్న దుర్గాదేవి ఆలయం సోమవారం తిరిగి తెరుచుకుంది. వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలు, పరిపాలనాపరమైన ఆంక్షల వల్ల ఈ ఆలయం చాలాకాలంగా మూసేసి ఉంది. దుర్గా పూజ, లక్ష్మీ పూజ వంటి వేడుకల కోసం మాత్రమే దీనిని తెరిచేవారు. తాను గెలిస్తే ఆలయాన్ని తెరిపిస్తానని అసన్‌సోల్ ఉత్తర్ స్థానం నుంచి పోటీ చేసిన భాజపా ఎమ్మెల్యే కృష్ణేందు ముఖర్జీ ప్రజలకు వాగ్దానం చేశారు. చెప్పినట్లుగానే సోమవారం గెలిచిన వెంటనే ఆయన ఆలయాన్ని సందర్శించి పునఃప్రారంభించారు.

# అన్నిరకాల దౌర్జన్యాలు చేశారు

- తనపై కూడా దాడికి తెగబడ్డారు
- ఫేస్‌బుక్ పేజీలో మమత ఫోన్‌కాల్ ఆడియో



కోల్‌కతా,మే6 : కౌంటింగ్ సెంటర్‌లో తనపై దాడి జరిగినట్లు మమతా బెనర్జీ పేర్కొన్నారు. టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీతో ఫోన్‌కాల్‌లో ఆమె ఈ ఆరోపణలు చేశారు. మమతా బెనర్జీ మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను ఎంపీ కళ్యాణ్ బెనర్జీ తన ఫేస్‌బుక్ పేజీలో పోస్టు చేశారు. కౌంటింగ్ వద్ద ప్రవర్తన సరిగా లేదని, తుది రౌండ్ల సమయంలో అక్రమాలు జరిగినట్లు మమతా బెనర్జీ తన ఫోన్ కాల్‌లో పేర్కొన్నారు. భబానీపూర్‌లో తుది రౌండ్ల కౌంటింగ్ మా ప్రాంతానివని, ఆ సమయంలో కొందరు గుండాలు కౌంటింగ్ సెంటర్‌లోకి ప్రవేశించారని, నన్ను కొట్టారని, సీఆర్పీఎఫ్ సహాయంతో మా ఏజెంట్లను తోసేశారని మమతా బెనర్జీ ఆ ఫోన్‌కాల్‌లో ఆరోపించారు. కీలక సమయంలో కౌంటింగ్ హాల్‌లోకి తనను ఎంట్రీ కానివ్వలేదన్నారు. భబానీపూర్‌లో కౌంటింగ్ ప్రక్రియ థ్రిల్లింగ్‌గా సాగింది. 20 రౌండ్ల కౌంటింగ్‌లో కొన్ని సమయాల్లో అటూ ఇటూ వెళ్లింది. ఆరంభంలో మమతా బెనర్జీ రెండు వేల ఓట్ల మెజారిటీతో ఉన్నారు. ఏడో రౌండ్ సమయానికి ఆమె 17 వేల ఓట్లు ఆధిక్యంలోకి వెళ్లారు. ఇక ఆ సమయంలో టీఎంసీ మద్దతుదారులు దాదాపు సంబరాలు చేసుకున్నారు. ఇక తర్వాత ఫలితాల్లో మార్పు మొదలైంది. 14వ రౌండ్ ముగిసే వరకు మమతా బెనర్జీ ఆధిక్యం నాలుగు వేలకు పడిపోయింది. కొన్ని రౌండ్ల తేడాలోనే నాటకీయంగా బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి ఆధిక్యంలోకి వెళ్లారు. ఆ తర్వాత ఆయన 15,105 ఓట్ల తేడాతో విజయాన్ని నమోదు చేశారు. దీంతో దీదీకి షాక్ ఇచ్చాడు సువేంధు. 16వ రౌండ్ వరకు తానే లీడింగ్‌లో ఉన్నట్లు మమతా బెనర్జీ పేర్కొన్నారు. కానీ తమ పార్టీకి చెందిన కౌంటింగ్ ఏజెంట్లను తొలగించిన తర్వాత మార్పు మొదలైనట్లు ఆమె ఆరోపించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లను సరైన సీలింగ్ లేకుండానే స్ట్రాంగ్‌రూమ్ లకు తరలించారని, తుది రౌండ్ల కౌంటింగ్ సమయంలో కౌంటింగ్ హాల్‌లో టీఎంసీ ప్రతినిధులు లేరని ఆమె పేర్కొన్నారు. చిత్రహింసకు గురిచేసినట్లు మమతా బెనర్జీ ఆరోపించారు. కేంద్రం, బీజేపీ ఆదేశాల ప్రకారమే ఎన్నికల సంఘం, సీఆర్పీఎఫ్, స్థానిక ఎన్నికల అధికారులు వ్యవహరించినట్లు మమతా బెనర్జీ విమర్శించారు. ఓటర్ రోల్స్‌లోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. బలవంతంగా ఓట్లను చోరీ చేశారన్నారు. అన్ని ఆధారాలను డాక్యుమెంట్ చేశామని, వాటిని కోర్టులో సమర్పించనున్నట్లు తెలిపారు.ఇది బీజేపీ విజయం కాదు, అనైతిక గేమ్ అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. తాజాగా ఎన్నికల్లో ఆ పార్టీకి కేవలం 81 సీట్లు మాత్రమే వచ్చాయని తేలింది. బీజేపీ 206 స్థానాల్లో విజయ కేతనం ఎగురవేసింది. అయితే భవానీపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సీఎం మమతా బెనర్జీ అనూహ్య రీతిలో ఓటమి పాలయ్యారు.ఈ నేపథ్యంలో ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజా తీర్పును చోరీ చేశారని ఆమె అన్నారు. అనైతిక రీతిలో తనను ఓడించినట్లు ఆమె చెప్పారు.

# సామాన్యులను అక్కున చేర్చుకున్న ఓటర్లు

### ప్రజల్లో ఆదరణతో బెంగాల్లో పనిమనిషి గెలుపు




కోల్‌కతా,మే6 : పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో ఓ మహిళ విజయం ఆసక్తికరంగా మారింది. భాజపా తరఫున పోటీ చేసిన కలితా మాఝీ అనూహ్యంగా రాజకీయ యవనికపై దూసుకు వచ్చి ఎమ్మెల్యే అయ్యారు. ఓ సామాన్యురాలని చట్టసభకు తీసుకుని వచ్చిన ఘనత బిజెపిదే అని చెప్పకతప్పదు. ఔస్‌గ్రామ్ నియోజకవర్గంలో ఆమె గెలుపొందారు. టీఎంసీ అభ్యర్థిపై 12,535 ఓట్లతో విజయం సాధించారు. మాఝీ.. గతంలో పలు ఇళ్లల్లో పనిమనిషిగా పనిచేశారు. నెలకు రూ.2,500 సంపాదించేవారు. ఆస్తులు, అంతస్తులు లేకపోయినప్పటికీ.. తన మంచితనంతో ఆమె ఇంతటి భారీ విజయాన్ని సాధించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గుస్కారా మున్సిపాలిటీకి చెందిన మాఝీ రాజకీయాల్లోకి రాకముందు పలు ఇళ్లల్లో సహాయకురాలిగా పని చేశారు. 2021 ఎన్నికల్లో భాజపా ఆమెకు సీటు ఇవ్వడంతో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన అభేదానంద థాండర్ చేతిలో ఓడిపోయారు. అయినప్పటికీ స్థానికులతో ఆమెకున్న సంబంధాలపై విశ్వాసంతో భాజపా మరోసారి తాజా ఎన్నికల్లో అవకాశం ఇవ్వడంతో ఈసారి ఆమె తన నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. సాధారణ పౌరులు సైతం ఎన్నికల్లో విజయం సాధించవచ్చని నిరూపించారు. మాఝీ విజయం బెంగాల్ రాజకీయాల్లో ఒక నిర్మాణాత్మకమైన మార్పును సూచిస్తోంది. మరోవైపు తమిళనాడులోనూ ఓ ఆటోడ్రైవర్ టీవీకే తరఫున ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యాడు. టీవీకే అధినేత విజయ్ కారు డ్రైవర్ కుమారుడు కూడా ఈ ఎన్నికల్లో భారీ విజయం సాధించాడు. ఇలా పలుచోట్ల పలు రకాలుగా వార్తలు వస్తున్నాయి.

# బెంగాల్, అసోం విజయాలపై ట్రంప్ అభినందనలు

### మోడీ సాధించిన విజయం 'చరిత్రాత్మకమంటూ వైట్ హౌజ్ ప్రకటన



న్యూఢిల్లీ,మే6 : భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో.. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, అస్సాంలలో సాధించిన ఘనవిజయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. మోదీ సాధించిన ఈ విజయాన్ని 'చరిత్రాత్మకమైనది, నిర్ణయాత్మకమైనది' అని అభివర్ణిస్తూ వైట్ హౌస్ అధికార ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రధాని మోదీకి పంపిన అభినందన సందేశంలో ట్రంప్.. తమ మధ్య ఉన్న బలమైన స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. 'నా స్నేహితుడు నరేంద్ర మోదీకి ఈ గొప్ప విజయం దక్కినందుకు అభినందనలు. భారత్ వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి తీర్పు రావడం ఆయన నాయకత్వానికి ప్రజలు ఇస్తున్న గౌరవం' అని పేర్కొన్నారు. గతంలో 'హౌడీ మోదీ', 'నమస్తే ట్రంప్' వంటి కార్యక్రమాల ద్వారా వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే.ఈ విజయం కేవలం భారత్‌కే కాకుండా, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వానికి కూడా కీలకమని వైట్ హౌస్ పేర్కొంది. మోదీ పటిష్ఠమైన నాయకత్వంలో భారత్-అమెరికా మధ్య ఉన్న 'సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యం' మరింత బలపడుతుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య వాణిజ్య, రక్షణ రంగాల్లో సహకారాన్ని మరింత వేగవంతం చేయాలని ఇప్పటికే ట్రంప్ నిర్ణయించుకున్నారు.ఇక, ఈ అభినందనల పట్ల ప్రధాని మోదీ కూడా స్పందించారు. అమెరికాతో కలిసి ప్రపంచ అభివృద్ధి, శాంతి కోసం మరింత సమర్థవంతంగా పనిచేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. కాగా, బెంగాల్‌లో తొలిసారి, అస్సాంలో వరుసగా మూడవసారి బీజేపీ విజయం సాధించడంపై అంతర్జాతీయ సమాజం ఆసక్తి చూపుతోంది.

# ఒకే ఒక్క ఓటుతో మాజీమంత్రి ఓటమి

- టివికె చేతిలో ఒక్క ఓటుతో ఓడిన పెరియకరుప్పన్



చెన్నై,మే6 : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ సృష్టించిన ప్రభంజనంలో పలువురు చిత్తయ్యారు. విజయ్ నేతృత్వంలోని ఆ పార్టీ 108 సీట్లు సాధించి.. అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీగా అవతరలించింది. డీఎంకే, అన్నా డీఎంకే పార్టీలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. అయితే విజయ్ వేవ్‌లో డీఎంకే నేతలు చెల్లాచెదురయ్యారు. ఆ రాష్ట్ర సహకార శాఖమాజీ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ అనూహ్యరీతిలో ఓటమిపాలయ్యారు. ఆయన కేవలఒకే ఒక్క ఓటు తేడాతో ఓటమి చెందారు. తిరుప్పత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తమిళగ వెట్రి కజగం పార్టీ నుంచి సీనివాస సేతుపథి పోటీ చేశారు. అయితే తాజా ఫలితాల్లో టీవీకే నేతకు 83, 375 ఓట్లు పోలయ్యాయి. ఇక రెండవ స్థానంలో పెరియకరుప్పన్‌కు 83,374 ఓట్లు పడ్డాయి. చాలా ఆసక్తికరంగా ఈ రేస్ కొనసాగింది. చివరి రౌండ్ వరకు పోటీ నువ్వానేనా అన్నట్లుగా సాగింది. చివరి రౌండ్ కన్నా ముందు రౌండ్‌లో 30 ఓట్ల ఆధిక్యంలో డీఎంకే నేత పెరియకరుప్పన్ ఉన్నారు. కానీ అనూహ్యమైన రీతిలో మాజీ మంత్రికి షాక్ తగిలింది. చివరి రౌండ్‌లో టీవీకే నేత సీనివాస సేతుపథ పుంజుకుని విజయాన్ని నమోదు చేశారు. పెరియకరుప్పన్ కన్నా ఒక్క ఓటు ఎక్కువ ఆర్జించారు. దీంతో టీవీకే నేత థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేశారు. తిరుప్పత్తూరు స్థానం నుంచి పోటీ చేసిన బీజేపీ నేత కేసీ తిరుమరన్ మూడవ స్థానంలో నిలిచారు. ఆయనకు 29,054 ఓట్లు పోలయ్యాయి.

# శాసనసభా పక్ష నేతగా విజయ్ ఎన్నిక

- ప్రభుత్వం ఏర్పాటుపై సమావేశంలో చర్చ
- మెజార్టీ కోసం గవర్నర్‌ను15 రోజులు గడువు కోరిన టివికె



చెన్నై,మే6: తమిళనాడులో అత్యధిక స్థానాలు సాధించిన టీవీకే పార్టీ మెజారిటీకి కొద్ది దూరంలో ఉంది. ఇదే సమయంలో పార్టీ లెజిస్లేటివ్ లీడర్‌గా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ ప్రకటించింది. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటుపై కూడా చర్చించారు. ప్రభుత్వ ఏర్పాటుకు కొన్ని సీట్లు తక్కువగా ఉన్న అంశాన్ని నేతలు ప్రస్తావించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ.. రాజకీయపరంగా ఆత్మ గౌరవం విషయంలో తమ పార్టీ రాజీపడబోదన్నారు. పొత్తు విషయంలోనూ తమ పార్టీ స్పష్టమైన వైఖరితో ఉందని ఆ పార్టీ నేతలు తెలిపారు. అధికారం చేపట్టేందుకు అవసరమైన మద్దతు కోసం తమ పార్టీ ఎవరినీ అడుక్కోబోదని తెలిపారు. ఇక, మెజారిటీ నిరూపించుకునేందుకు టీవీకే నేతలు గవర్నర్‌ను కలిసి 15 రోజుల సమయం కోరారు. 234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడులో టీవీకే 108 సీట్లు సాధించి, అతిపెద్ద పార్టీగా మారింది. అధికారం చేపట్టాలంటే మరో 10 సీట్లు అవసరం. టీవీకేకు 35 శాతం ఓట్లు పోలయ్యాయి. మరోవైపు కాంగ్రెస్‌తో పొత్తు కోసం టీవీకే ప్రయత్నిస్తోందని ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు కాంగ్రెస్‌తో రాయబారం నడుస్తోందని తెలుస్తోంది. విజయ్ తండ్రి చంద్రశేఖర్ కూడా కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారు. విజయ్ పార్టీ టీవీకే అధికారం చేపట్టాలంటే పొత్తు పెట్టుకోక తప్పని పరిస్థితి. విజయ్ ఎవరితో పొత్తువైపు మొగ్గు చూపుతారో తెలియాలి.

# వడ్ల కొనుగోలు ఆలస్యం.. గుండెపోటుతో రైతు మృతి

**బలగం టీవీ, కరీంనగర్:**



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాక గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. వడ్లను అమ్మడానికి సిద్ధం చేస్తున్న సమయంలో గుండెపోటుకు గురై రైతు ఐలయ్య మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం మబ్బులు కమ్ముకోవడంతో వర్షం పడే సూచనలు కనిపించాయి. ఈ నేపథ్యంలో తాను పండించిన వడ్లను తడవకుండా కాపాడుకోవాలనే ఆందోళనతో ఐలయ్య వేగంగా వడ్లను కుప్పలుగా పోస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.

స్థానికులు వెంటనే స్పందించినప్పటికీ అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. ప్రభుత్వం సకాలంలో వడ్ల కొనుగోలు చేసి ఉండి ఉంటే రైతు ఇలాంటి ఆందోళనకు గురికాకుండా ఉండేవాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, పంట కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# టెక్నికల్, బ్యాంకింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**



సిరిసిల్ల టాస్క్(తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) రీజనల్ సెంటర్లో టెక్నికల్ కోర్సులు, బ్యాంకింగ్ నందు ఉచిత శిక్షణ అందిస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ డిగ్రీ/బీటెక్ అభ్యర్థులకు ఈ నెల 8వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఓరియెంటషన్ కు హాజరు కావాలని సూచించారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులకు 11 వ తేదీ నుంచి బ్యాచ్ ప్రారంభం అవుతుందని తెలిపారు.

టాస్క్ నందు శిక్షణ పొందిన అభ్యర్థులకు మంచి ప్యాకేజీలతో ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మిగతా వివరాలకు 9573420718, 7075522671 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

# ఏసీబీ వలలో చిక్కిన బోధన్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ.

**రూ.7 వేల లంచం తీసుకుంటూ పట్టుబాటు**

**బలగం టీవీ, నిజామాబాద్:**



నిజామాబాద్ జిల్లాలోని బోధన్ టూ టౌన్ పోలీస్ స్టేషన్కు చెందిన ఎస్ఐ చిటన్నోజు భాస్కరాచారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలలో చిక్కారు. తన సోదరుడి కుమారుడి పేరును క్రిమినల్ కేసులో చేర్చకుండా ఉండేందుకు ఫిర్యాదుదారుని నుండి రూ.7,000 లంచం డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు పన్నిన ఉచ్చులో భాగంగా ఎస్ఐ భాస్కరాచారి లంచం స్వీకరిస్తున్న సమయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అతనిని అదుపులోకి తీసుకుని, అవసరమైన కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో పోలీస్ విభాగంలో అవినీతి వ్యవహారాలపై మరోసారి చర్చ మొదలైంది. ప్రజలు ఇలాంటి అక్రమాలపై ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు.



# భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల యాజమాన్యాన్ని చేపట్టాలి..

**- ఎంసీ చైర్మన్ సబేరా గౌస్, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రైతులు పంటలను సాగు చేసేటప్పుడు సేంద్రియ పద్ధతులను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులు పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సిరిసిల్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ పి మాధవి, డాక్టర్ కే ప్రీతిక రెడ్డి రైతులకు సూచించారు. బొప్పాపూర్ గ్రామం లో ఏర్పాటు చేసిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు మరియు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - రైతు వారోత్సవాలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా, డాక్టర్ పి మాధవి మాట్లాడుతూ భూసార పరీక్షలు ప్రతి రైతు చేసుకోవలీ. రసాయన ఎరువులను తగ్గించడం వలన చీడ పీడల బెడద కూడా తగ్గుతూ నేల సాగు పెరిగి భౌతిక లక్షణాలు మెరుగుపడుతుందన్నారు.

ఏఎంసీ చైర్మన్ సబేరా- గౌస్, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పచ్చిరొట్ట పంటలను వేసుకొని తమ నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తూ, బావి తరాలకు సారవంతమైన నేలలను అందించాలని ఆశించారు. రైతులకు రైతులు వరి పంటలలో సన్న రకాలను సాగు చేయవచ్చని చెప్పారు ఆర్ఎన్ఆర్ 15048, ఖచీవీ -1638, హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్ వంటి రకాలను సాగు చేయవచ్చు అని సూచించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను పండించి అధిక ఆదాయం పొందవచ్చన్నారు.

డాక్టర్ కే ప్రతీక రెడ్డి మాట్లాడుతూ.. జీరో టిల్లజ్ పద్ధతిలో వరి మాగానులో మొక్కజొన్న,పెసర, మినుము పంటలను సాగు చేస్తూ సాగు భారం తగ్గి మంచి ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ కుమార్, అదనపు వ్యవసాయ సంచలకులు, మార్కెట్ కమిటీ చైర్మన్, జి. రామ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, రాజశేఖర్, వ్యవసాయ అధికారి, ఏఈఓ కె . వెంకటేష్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పి. ఆదిత్య, కె.మెహెర్, గీతాంజలి, సర్పంచ్, మహిళ రైతులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట సొసైటీలో సింగిల్ విండో చైర్మన్‌గా కృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకారం..

**చార్జ్ తీసుకున్న సింగిల్ విండో పాలకవర్గం.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎల్లారెడ్డిపేట సొసైటీ సింగిల్ విండో చైర్మన్‌గా కృష్ణారెడ్డి బుధవారం రోజున అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్లు మరియు సిబ్బంది హాజరై కొత్త చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని, సొసైటీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# ఎల్లారెడ్డిపేట పీఏసీఎస్ చైర్మన్‌గా గుండారపు కృష్ణారెడ్డికి సత్కారం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా గుండారపు కృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట ఆగన్న ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని, సహకార సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ వరుస కృష్ణ హరి, మాజీ జడ్పిటిసి చీటి లక్ష్మణరావు, సంఘం వైస్ చైర్మన్, డైరెక్టర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు పండించిన

# ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది..

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని పలు రైస్ మిల్లులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లుల్లో ధాన్యం దిగుమతి ప్రక్రియ, మిల్లింగ్ జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మంగళవారం మంత్రుల బృందం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ధాన్యం సేకరణపై కీలక సూచనలు చేశారని, ఆ మేరకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటోందని అన్నారు . కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించేందుకు అదనంగా లారీలు, వ్యాన్లను ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైతే ట్రాక్టర్లను కూడా రవాణాకు వినియోగించేలా వెసులుబాటు కల్పించామని పేర్కొన్నారు.

?ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ క్రమంలో రైతులను ఇబ్బంది పెట్టే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, తూకాల్లో తేడాలు వచ్చినా లేదా రైతులను ఇబ్బందులకు గురిచేసినా సహించేది లేదని అన్నారు . రైస్ మిల్లుల్లో నిల్వ సామర్థ్యం తగ్గిన పక్షంలో, జిల్లా కేంద్రంలోని అపారెల్ పార్క్ గోదాముల్లో ధాన్యం దిగుమతికి ఏర్పాట్లు చేశామని అన్నారు . అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా జాప్యం లేకుండా చూస్తున్నామని అన్నారు.

# పేదల సొంతింటి కలే ప్రభుత్వ లక్ష్యం..



**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ :**

పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం నాగయ్య పల్లి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇల్లుగృహప్రవేశ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు..అనంతరం నాగయ్య పల్లి గ్రామంలో శ్రీ దుబ్బ రాజరాజేశ్వర స్వామి వారి ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు..

# ధాన్యం తరలింపునకు లారీల సంఖ్య పెంచాలి..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టివి, బోయిన పల్లి :**



జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెనువెంటనే తరలించేందుకు వీలుగా లారీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ రవాణా కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం బోయినపల్లి మండలం కొదురుపాక, వేములవాడ అర్బన్ మండలం అనుపురంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ఐకేపీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కేంద్రాలకు ఇప్పటివరకు వచ్చిన ధాన్యం నిల్వలు, జరిగిన తూకం, రైస్ మిల్లులకు తరలించిన వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకానికి అనుగుణంగా రవాణా వాహనాలను సిద్ధం చేయాలని, ఎక్కడా జాప్యం జరగకూడదని అన్నారు . అకాల వర్షాల సూచన ఉన్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఇతర ముందస్తు ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. రైతులకు అవసరమైన కనీస వసతులు కల్పించాలని, నిబంధనలకు లోబడి పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ సాగాలని అధికారులను ఆదేశించారు.

**మిల్లుల వద్ద హమాలీల సంఖ్య పెంచాలి..**

అనంతరం బోయినపల్లి మండలం జగ్గారావుపల్లిలోని సుహాస్ రైస్ మిల్లును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించినారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మిల్లుల వద్ద హమాలీల సంఖ్యను పెంచడం ద్వారా ధాన్యం దిగుమతిని వేగవంతం చేయాలని మిల్లర్లను ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆన్‌లైన్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరగా జమ అయ్యేలా చూడాలని అన్నారు . ధాన్యం తరలింపులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణా వ్యవస్థను పటిష్టం చేయాలని, అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు.

సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎల్ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ షరీఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటే నిర్భయంగా ఫిర్యాదు చేయాలి..




**-మహిళ భద్రతపై పని ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు: జిల్లా షీ టీమ్.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




జిల్లాలో మహిళల భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళలు పని చేసే ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నివారణ,పని ప్రదేశాల్లో మహిళల భద్రతా చర్యలు, మహిళ చట్టాలపై సమగ్రంగా అవగాహన కల్పిస్తున్నారు.

ఈ సందర్భంగా బుధవారం రోజున తంగళ్లపల్లి మండల పరిధిలోని తాడూర్, గోపాల్రావుపల్లి, లక్ష్మీపూర్, గ్రామాల్లో ఉపాధి హామీ పనికి వెళ్లే మహిళకు అవగాహన కల్పించి, వేధింపులకు గురైతే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని,నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని,ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని షీ టీమ్అధికారులు సూచించారు.సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవొద్దని తెలిపారు.

ఏప్రిల్ నెలలో జిల్లాలో వేధింపులకు పాల్పడిన వారిపై 04 ఎఫ్ ఐ ఆర్ లు, 02 పెట్టి కేసులు నమోదు చేసి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల, రవి, సిబ్బంది శ్రీలత, శ్రీనివాస్ తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కోనరావుపేటలో రైతులు, బీఆర్ఎస్ నేతల భారీ ధర్నా..



**జిల్లాలో వడ్ల కొనుగోళ్ల జాప్యంపై భగ్గుమన్న రైతులు, బిఆర్ఎస్ శ్రేణులు..**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని మర్రి వద్ద రైతులు మరియు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా ధర్నా నిర్వహించారు. జిల్లాలో వడ్ల కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

రైతులు మాట్లాడుతూ, ఇసుక తరలింపుకు వందల లారీలు అందుబాటులోకి వస్తున్నప్పటికీ, వడ్ల తరలింపుకు మాత్రం లారీలు రాకపోవడం అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు సమయం కేటాయిస్తున్నప్పటికీ, రైతుల సమస్యలను పట్టించుకునే తీరిక లేకపోవడంపై ప్రశ్నించారు.

బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ధాన్యం సేకరణ వేగంగా జరిగేదని, ప్రస్తుతం కొనుగోళ్లలో జాప్యం వెనుక కారణాలు ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల కారణంగా వడ్ల కుప్పలు తడిసి రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వెంటనే లారీలు ఏర్పాటు చేసి, వడ్ల కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని నినాదాలు చేశారు. రైతులు రోడ్డుపై బైఠాయించడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ ఆందోళనలో వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు మరియు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని నిరసనకారులు హెచ్చరించారు.



# మొక్కజొన్న కొనుగోలులో జాప్యం అరికట్టాలి..

**లారీలు వెంటనే పంపించాలని ఎమ్మెల్యే సంజయ్ డిమాండ్**

బలగం టీవీ, కోరుట్ల:

కోరుట్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరిశీలించారు. గత నాలుగు వారాలుగా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మహిళా రైతులు ఎమ్మెల్యే కాళ్ల మీద పడుతూ తమ గోడును వినిపించారు. పండించిన పంట కొనుగోలు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే ప్రభుత్వం స్పందించాలని వారు కోరారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే మార్క్‌ఫెడ్ డీఎంకు ఫోన్ చేసి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. లారీలు తక్షణమే పంపించి నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. "లారీలు పంపించండి... అవసరమైతే నేను మోస్తాను, లేదంటే మా కార్యకర్తలు మోస్తారు. కానీ రైతుల పంట వృథా కాకుండా చూడాలి" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఈ సమస్యను వదిలిపెట్టబోమని, తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన హెచ్చరించారు.

# అభివృద్ధి బాటలో వేములవాడ..

**ఏకగ్రీవంగా ముగిసిన కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ**

**విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో వేములవాడలో కో-ఆప్షన్ సభ్యుల ఎంపిక**

**రాబోయే రోజుల్లో అన్ని వర్గాలకు సముచితస్థానం కల్పిస్తాం**

**పార్టీ కోసం నిరంతరం కష్టపడే ప్రతి కార్యకర్తకు సరైన గుర్తింపు ఉంటుంది**

**పదవులు రాని వారు అధైర్య పడవద్దు..**

**వేములవాడ అభివృద్ధికి అందరూ సహకరించాలి**

**పుల్కం రాజు**



బలగం టీవీ, వేములవాడ

వేములవాడ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా, ఏకగ్రీవంగా ముగిసింది. నాలుగు కో-ఆప్షన్ సభ్యుల స్థానాల భర్తీ కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో కట్కూరి శ్రీనివాస్, ఫీర్ మహమ్మద్, దుర్గం విజయ పర్శరాము, తుమ్మ జ్యోతి ఇన్నారెడ్డిలను సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ?ఈ ఎన్నికల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికలు ఎటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తి కావడంతో, నూతనంగా ఎన్నికైన నలుగురు సభ్యులకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పట్టణ ప్రగతిలో కో-ఆప్షన్ సభ్యుల బాధ్యత ఎంతో కీలకమని, స్థానిక అభివృద్ధిలో వారు చురుకైన పాత్ర పోషించాలని ఆయన సూచించారు. ?ఎన్నికల అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ఆధ్వర్యంలో కౌన్సిలర్లు నూతన సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ, వేములవాడ పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి ఈ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక ఒక ముఖ్యమైన ఘట్టమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యవేక్షణలో, వారి మార్గదర్శకత్వంలో ఈ ఎన్నిక ఏకగ్రీవం కావడం చాలా సంతోషకరమని ఆయన అన్నారు. ఈ ప్రక్రియకు సంపూర్ణ సహకారం అందించిన కౌన్సిలర్లకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, మరియు వేములవాడ పట్టణ ప్రజలకు ఆయన ఈ సందర్భంగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ?మున్సిపల్ పాలకవర్గం తీసుకునే ప్రతి నిర్ణయం పట్టణ ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు



# సేంద్రియ ఎరువులతోనే భూసారం పదిలం

**రసాయనాల వాడకం తగ్గించి దిగుబడులు సాధించాలి**

**'రైతు వారము' కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచన**

బలగం టీవీ, కాల్వ శ్రీరాంపూర్

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వైపు మళ్లడం ద్వారానే భూసారాన్ని కాపాడుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) సంధ్య అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల కార్యాచరణ ప్రణాళిక'లో భాగంగా, బుధవారం పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మరియు కునారం రైతు వేదికలలో 'రైతు వారము' కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త వినోద్ రైతులకు పలు కీలక సూచనలు చేశారు. నేల ఆరోగ్యం:లిలి వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమిలోని పోషకాలు నశించి, మిత్ర పురుగులు చనిపోతాయని హెచ్చరించారు. కొయ్యలను భూమిలోనే కలియదున్నడం వల్ల నేలకు బలం చేకూరుతుందన్నారు. పంట మార్పిడి:లిలి ఒకే రకమైన పంటలు వేయకుండా, పంట మార్పిడి పద్ధతులను పాటించడం వల్ల తెగుళ్ల ఉధృతి తగ్గి, దిగుబడులు పెరుగుతాయని వివరించారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఈ సందర్భంగా వక్తలు కోరారు. రసాయన ఎరువుల ఖర్చు తగ్గించుకుని, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, తాసిల్దార్ రాముడు, కేడీసీసీబీ మేనేజర్ కరుణ శ్రీ, ఏఎంసీ వైస్ చైర్మన్ రాయమల్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఐకెపి కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి..




**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఐకెపి కేంద్రాల ద్వారా రైతుల వరి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి. స్కైలాబ్ బాబు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో బి.వై. నగర్‌లోని అమృతలాల్ శుక్ల భవన్‌లో కోడం రమణ అధ్యక్షతన జరిగిన సిపిఎం జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి. స్కైలాబ్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై,మాట్లాడుతూ నెల రోజులుగా ఎండలో ఎండుతూ, అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కోసం ప్రవేశపెట్టిన యాప్ వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని, క్వింటాకు రూ. 2389 మద్దతు ధర ఉండగా, నిబంధనల సాకుతో రైతులు రూ. 1700కే అమ్ముకోవాల్సిన దుస్థితి కల్పిస్తున్నారని అన్నారు. తరుగు పేరిట రైతులను దోపిడీ చేయవద్దని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏసీ గదుల నుండి బయటకు వచ్చి ఐకెపి కేంద్రాలను సందర్శిస్తేనే రైతుల కష్టాలు తెలుస్తాయని హితవు పలికారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిరసిస్తూ మే 11న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి మూసం రమేష్ మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి కృత్రిమ కొరత సృష్టించడం వల్ల హోటళ్లు, టీ స్టాళ్లు నడుపుకునే పేదలపై తీవ్ర భారం పడుతోందని అన్నారు.ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య, అన్నల్దాసు గణేష్, సూరం పద్మ, గురిజాల శ్రీధర్, శ్రీరాముల రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



# వడ్ల కుప్పపైనే రైతు 'గుండె' ఆగింది!

**- ధాన్యం తూకం వేయకపోవడంతో మనస్తాపం.. గద్దపాకలో విషాదం**

**- బాధితుడి పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

**- రైతు కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్**

బలగం టీవీ, శంకరపట్నం

పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రానికి వచ్చిన ఓ అన్నదాతకు నిరీక్షణే మిగిలింది. 15 రోజులుగా కళ్లం దగ్గరే పడిగాపులు కాసినా ధాన్యం తూకం వేయకపోవడంతో, మనస్తాపానికి గురై వడ్ల కుప్పపైనే గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. శంకరపట్నం మండలం గద్దపాక గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గద్దపాక సర్పంచ్ కొయ్యడ పర్శరాం తండ్రి ఐలయ్య (65) మంగళవారం వడ్ల కుప్పపైనే కుప్పకూలి కన్నుమూశారు.

**అంత్యక్రియల్లో పాల్గొన్న రసమయి**

రైతు ఐలయ్య అంత్యక్రియలకు మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరయ్యారు. ఐలయ్య పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన ఆయన, స్వయంగా పాడె మోసి తన సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

**ఇందిరమ్మ రాజ్యంలో రైతుల బతుకులు బుగ్గిపాలు**

"ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనే దిక్కులేక రైతన్నలు ప్రాణాలు వదులుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది?" అని రసమయి ప్రశ్నించారు. ఈ మృతికి స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

కేంద్రాలు తెరిస్తే సరిపోదు: ఎమ్మెల్యేలు కేవలం రిబ్బన్లు కట్ చేసి కేంద్రాలు ప్రారంభించడం కాదు, లారీలు తెప్పించి మిల్లులకు ధాన్యం తరలించేలా చూడాలని విమర్శించారు.

రైతు భీమా ఏమైంది?: గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు చనిపోతే రూ. 5 లక్షల భీమా వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

భారీ ఎక్స్‌గ్రేషియా: మరణించిన ఐలయ్య కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

"ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు" అని రసమయి వ్యాఖ్యానించారు. రైతుల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

# రెండు దశాబ్దాల తర్వాత అపురూప కలయిక..

**బోయినిపల్లిలో పూర్వ విద్యార్థుల సందడి**

బలగం టీవీ, ?బోయినిపల్లి:

సరిగ్గా 21 ఏళ్ల క్రితం ఒకే తరగతి గదిలో పాఠాలు విని, భవిష్యత్తు కలలతో విడిపోయిన ఆ నేస్తాలంతా మళ్లీ ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అత్యంత కోలాహలంగా జరిగింది. చదువు పూర్తిచేసి విడిపోయిన వీరంతా, మళ్లీ తాము ఎక్కడైతే విడిపోయారో అక్కడే కలుసుకోవాలని నిర్ణయించుకోవడం విశేషం.?పూర్వ విద్యార్థి కన్నం సాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ చిన్ననాటి స్నేహితులను చూసి భావోద్వేగానికి లోనయ్యారు. రెండు దశాబ్దాల సుదీర్ఘ విరామం కావడంతో ఒకరినొకరు "నన్ను గుర్తుపట్టావా?" అని ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. వయసు రీత్యా వచ్చిన మార్పులను పక్కన పెట్టి, పాఠశాల రోజుల్లో తాము చేసిన అల్లరిని, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంలో మునిగితేలారు. తమ ప్రస్తుత ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ వివరాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ గడిపారు.?తమను ఉన్నత శిఖరాలకు చేర్చిన గురువులను విద్యార్థులు మర్చిపోలేదు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించారు. వారి ఆశీస్సులు తీసుకుని, గురువులను ఘనంగా సన్మానించి మెమెంటోలను అందజేశారు.

?ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారందరం 21 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి రావడం వెలకట్టలేని ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ కలయిక కేవలం పలకరింపులకే పరిమితం కాకుండా, చిన్ననాటి మిత్రుల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసిందని ఆనందం వ్యక్తం చేశారు.





# ఘనంగా ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల,:

సిరిసిల్ల పట్టణంలోని శ్రీ శ్రీ ముత్యాల పోచమ్మ తల్లి దేవాలయ 16వ వార్షికోత్సవం పురస్కరించుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళా చక్రపాణి మాట్లాడుతూ, భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా ముత్యాల పోచమ్మ అమ్మవారు నిత్యం పూజలందుకుంటున్నారని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అర్చకులు చైర్‌పర్సన్‌ను ఆశీర్వదించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుడ్ల శ్రీనివాస్, కూర భాగ్యలక్ష్మి, అడిచెర్ల రూపా సాయి, గెంట్యాల శ్యామల, మంచె రేణుక, పాషికంటి రమ్య, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కోడం సంజీవ్, ఎలగందుల శంకర్ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# బోయినిపల్లిలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు పూర్తి

బలగం టీవీ, బోయినిపల్లి:

ఎస్సీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్ 2025-26లో భాగంగా వ్యక్తిగత రుణాల మంజూరీ కోసం బుధవారం బోయినిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారుల ఎంపిక ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్.శరత్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 118 మందికి గాను 89 మంది లబ్ధిదారులు హాజరయ్యారు.

?మండలంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు అభ్యర్థుల వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.జయశీల, ఏఓ ప్రణీత, వెటర్నరీ డాక్టర్ శ్రీధర్, ఏపీఎం పవన్ కుమార్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేతన్నకు 'మహిళా శక్తి' భరోసా..

**-కోటి చీరల ఆర్డర్‌తో వస్త్ర పరిశ్రమకు పూర్వవైభవం..**

**-ప్రభుత్వ ఆర్డర్ ను గడువులోగా పూర్తి చేయాలి.**

**-ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల:**

రాష్ట్రంలోని వస్త్ర పరిశ్రమకు పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతున్నదని,తెలంగాణలోని ఏడు జిల్లాల వస్త్ర పరిశ్రమలకు కోటి ఇందిరా మహిళా శక్తి నూతన చీరల తయారీ ఆర్డర్‌ను అందజేసినట్లు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . రాష్ట్రంలోని ఏడు జిల్లాల వస్త్ర పరిశ్రమకు ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో మొత్తం కోటి చీరల ఆర్డర్ ను అందజేసే కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా.. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన రంగుల చీరలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, కోటి మంది మహిళలకు కోటి చీరలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 130 మ్యాక్స్ సంఘాలతో పాటు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, జనగాం, యాదాద్రి జిల్లాలకు కలిపి మొత్తం 7 కోట్ల మీటర్ల వస్త్రం ఆర్డర్ ఇచ్చామని అన్నారు.ఇందులో 95 లక్షల సాధారణ చీరలతో పాటు, ఐదు లక్షల గోచి చీరల తయారీకి అవకాశం కల్పించినట్లు తెలిపారు . ఈ నిర్ణయం వల్ల వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన వేలాది కుటుంబాలకు రాబోయే ఆరు నుండి ఏడు నెలల పాటు నిరంతర ఉపాధి లభిస్తుందని అన్నారు .

పరిశ్రమను ఆర్థికంగా ఆదుకోవడంలో భాగంగా ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న 352 కోట్ల రూపాయల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిందని అన్నారు . సీఎం రేవంత్ రెడ్డి కృషితో వేములవాడలో 50 కోట్ల రూపాయలతో యారన్ బ్యాంక్ ఏర్పాటు చేశామని, తద్వారా నేతన్నలకు 90 శాతం క్రెడిట్‌పై నూలు అందిస్తున్నామని అన్నారు . అలాగే రూ. 5 లక్షల బీమా, రుణమాఫీ వంటి పథకాలతో నేతన్నలకు అండగా నిలుస్తున్నామని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎన్పీడీసీఎల్ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని చేశారు.

హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ మాట్లాడుతూ, తయారవుతున్న చీరల నాణ్యత పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇదే నాణ్యతను పాటించాలని, కేవలం ప్రభుత్వ ఆర్డర్లపైనే కాకుండా యారన్ బ్యాంక్‌ను వాడుకుంటూ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, స్థానిక కార్మికులు నేసిన చీరలు మహిళల ఆత్మగౌరవానికి గుర్తింపుగా నిలుస్తున్నాయని, వారి శ్రమకు తగిన విలువ దక్కడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు స్వరూప, రాములు నాయక్, చేనేత జౌళి శాఖ జేడీ వెంకటేశ్వర రావు, ఏడీ సంతోష్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు తదితరులు పాల్గొన్నారు.



# అహ్మదాబాద్‌లోనే ఐపీఎల్-2026 ఫైనల్

**ప్లే ఆఫ్ వేదికలను ప్రకటించిన బీసీసీఐలిలి**

**ధర్మశాలలో క్వాలిఫయర్-1.. చండీగఢ్‌లో ఎలిమినేటర్**

**మే 31న తుది పోరుకు ముస్తాబవుతున్న నరేంద్ర మోదీ స్టేడియం**

**బలగం టీవి, హైదరాబాద్**

క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (క్ష్మీూా 2026) ముగింపు ఘట్టానికి వేదికలు ఖరారయ్యాయి. ఈ ఏడాది మెగా ఫైనల్‌కు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం మరోసారి ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ మేరకు ప్లే ఆఫ్ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్ మరియు వేదికల వివరాలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (దీజజక్ష్మీ) బుధవారం విడుదల చేసింది.

గతంలో 2022, 2023 సీజన్ల ఫైనల్ మ్యాచ్‌లకు వేదికగా నిలిచిన అహ్మదాబాద్ స్టేడియం, ఇప్పుడు 2026 ఫైనల్‌కు కూడా సిద్ధమైంది. మే 31వ తేదీన జరిగే ఈ తుది పోరులో విజేత ఎవరో తేలనుంది. ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియం కావడంతో భారీ స్థాయిలో అభిమానులు హాజరయ్యే అవకాశం ఉంది.

లీగ్ దశ ముగిసిన తర్వాత జరిగే కీలకమైన ప్లే ఆఫ్ మ్యాచ్‌ల వేదికలను బీసీసీఐ కొత్తగా ఎంపిక చేసింది:

క్వాలిఫయర్ 1 (మే 26):లిలి లీగ్ పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య జరిగే ఈ మ్యాచ్‌కు ధర్మశాలలోని అందమైన హెచ్‌పీసీఏ (ూజాూ) స్టేడియం వేదిక కానుంది.

ఎలిమినేటర్ (మే 27):లిలి మూడు, నాలుగు స్థానాల్లోని జట్ల మధ్య పోరు న్యూ చండీగఢ్‌లోని కొత్త స్టేడియంలో జరగనుంది.

క్వాలిఫయర్ 2 (మే 29):లిలి ఫైనల్ బెర్తును నిర్ణయించే రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌ను కూడా న్యూ చండీగఢ్‌లోనే నిర్వహించనున్నారు.

ఈ వేదికల ఎంపికపై క్రికెట్ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ధర్మశాల, చండీగఢ్ వంటి నగరాల్లో ప్లే ఆఫ్ మ్యాచ్‌లు నిర్వహించడం వల్ల ఆయా ప్రాంతాల్లోని క్రీడాభిమానులకు పండగ వాతావరణం నెలకొననుంది.

# బస్టాండ్‌లో మఫ్టీలో నిల్చున్న మల్కాజిగిరి పోలీస్ కమిషనర్

**రెచ్చిపోయిన ఆకతాయిలు**

**సుమారు 40 మందికి కౌన్సిలింగ్**

**బలగం టీవి, హైదరాబాద్**



మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఐపీఎస్ అధికారి సుమతి కమిషనరేట్ పరిధిలో గ్రౌండ్ లెవెల్ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు మంగళవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో ఎలాంటి సెక్యూరిటీ లేకుండా, మఫ్టీలో సాధారణ మహిళలా దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్‌లో నిల్చున్నారు. ఆమె ఎవరో తెలియక కొందరు పోకిరీలు ఆమెను చుట్టుముట్టారు. వస్తావా... నీ రేటు ఎంత... ఎంతివ్వాలంటూ ఆకతాయిలు వెకిలి ప్రశ్నలతో రెచ్చిపోయారు. దాదాపు 40 మంది వరకు పోకిరీలు, ఆకతాయిలు వెంటపడ్డారు. ఒంటరిగా నిలబడి ఉన్న మహిళా ఒక పోలీస్ కమిషనర్ అని తెలియక ఆమె పట్ల ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. మహిళలు ఒంటరిగా ఉంటే ఎటువంటి పరిస్థితులు ఎదుర్కుంటున్నారో స్వయంగా తెలుసుకోవడానికి పోలీస్ కమిషనర్ ఈ సాహసం చేశారు. అర్ధరాత్రి 12గంటల నుంచి తెల్లవారు 3గంటల వరకు పోకిరీలు హంగామా సృష్టించారు. ఆ సమయంలో ఎలాంటి పెట్రోలింగ్ వాహనంగానీ, గస్తీ పోలీసులు గానీ అక్కడికి రాకపోవడంతో వారు మరింత రెచ్చిపోయారు. వారిలో ఎక్కువగా విద్యార్థులు, ఉద్యోగులు ఉన్నారని పోలీసు వర్గాలు తెలిపాయి. వారిలో కొంతమంది గంజాయి, మద్యం సేవించిన వారున్నారు. ఇదిలావుండగా ఉదయం మూడున్నర గంటల తర్వాత ఒక బీట్ కానిస్టేబుల్ అక్కడి రావడంతో కమిషనర్‌ను గుర్తించారు. వెంటనే ఎస్ఐ వచ్చి సెల్యూట్ చేయడంతో మాల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌గా బయటపడింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 40మంది పోకిరీలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి తప్పులు చేయకుండా హెచ్చరించారు. ఏది ఏమైనా ఒక పోలీస్ కమిషనర్ అయి ఉండి స్వయంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్ని అవగాహన చేసుకోవడానికి ఒంటరిగా మూడు గంటల పాటు నిలబడిన పోలీస్ కమిషనర్ పట్ల నగర వాసులనుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. కమిషనర్ సాహసంతో మహిళలకు మరింత భద్రతా లభిస్తుందని, భరోసా కలుగుతుందని అభిప్రాయపడ్డారు.




# రఘు శర్మ ఎమోషనల్ సెలబ్రేషన్..

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ లో సోమవారం లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్ ఒక అరుదైన దృశ్యానికి వేదికైంది. ముంబై ఇండియన్స్ తరపున డెబ్యూ చేసిన స్పిన్నర్ రఘు శర్మ తన మొదటి వికెట్‌ను వెరైటీగా సెలబ్రేట్ చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతను లక్నో బ్యాటర్ అక్షత్ రఘువంశీని అవుట్ చేసి తన కెరీర్‌లో ఫస్ట్ ఐపీఎల్ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. వికెట్ తీసిన వెంటనే రఘు తన జేబులోంచి ఒక చిన్న కాగితం తీసి స్టాండ్స్ వైపు చూపిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆ నోట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. రఘు శర్మ చూపించిన ఆ నోట్ మీద ఎంతో ఎమోషనల్ మెసేజ్ ఉంది. "రాధే రాధే.. గురుదేవుల దైవ కృప వల్ల నా 15 ఏళ్ల సుదీర్ఘమైన బాధాకరమైన నిరీక్షణ ఈరోజుతో ముగిసింది. నాకు ఈ అద్భుతమైన అవకాశం ఇచ్చిన ముంబై ఇండియన్స్ (బ్లూ అండ్ గోల్డ్) టీమ్ కు ఎప్పటికీ రుణపడి ఉంటాను. జై శ్రీరామ్" అని అందులో రాసి ఉంది. లక్నో ఇన్నింగ్స్ 13వ ఓవర్ లో రఘు తన బౌలింగ్ లోనే రిటర్న్ క్యాచ్ పట్టి అక్షత్ ను అవుట్ చేశాడు. ఈ మూమెంట్ కోసం అతను దాదాపు 15 ఏళ్లుగా కష్టపడుతున్నట్లు ఆ నోట్ ద్వారా స్పష్టమైంది. ముంబై ఫ్రాంచైజీ తనపై నమ్మకం ఉంచి ఛాన్స్ ఇవ్వడం పట్ల అతను చాలా ఎమోషనల్ అయ్యాడు. రఘు శర్మ సెలబ్రేషన్ చూస్తుంటే ఐపీఎల్ అనేది కేవలం ఆట మాత్రమే కాదు, ఎంతోమంది కల అని అర్థమవుతోంది. 15 ఏళ్ల తర్వాత అతను సాధించిన ఈ విజయం యువ క్రికెటర్లకు ఒక ఇన్స్పిరేషన్ అని చెప్పొచ్చు. మరోవైపు పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉన్న లక్నో సూపర్ జెయింట్స్ ఈ మ్యాచ్ లో బ్యాట్‌తో చెలరేగింది. రిషబ్ పంత్ నాయకత్వంలోని లక్నో టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోరు సాధించింది. వెస్టిండీస్ పవర్ హిట్టర్ నికోలస్ పూరన్ ఈ సీజన్ లో తన మొదటి హాఫ్ సెంచరీతో విరుచుకుపడ్డాడు. కేవలం 21 బంతుల్లోనే 63 పరుగులు చేసి ముంబై బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. ఓపెనర్ మిచెల్ మార్ష్ కూడా 44 పరుగులతో రాణించి జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. లక్నో టీమ్ కి ఇది తొమ్మిదో మ్యాచ్ కాగా, ఈసారి బ్యాటర్లు పక్కా ప్లాన్ తో గ్రౌండ్ లోకి దిగినట్లు కనిపించింది.లక్నో టీమ్ భారీ స్కోరు చేసినప్పటికీ కెప్టెన్ రిషబ్ పంత్ ఫామ్ మాత్రం ఆందోళన కలిగిస్తోంది. ఈ మ్యాచ్ లో పంత్ కేవలం 15 పరుగులు మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. ఈ సీజన్ లో అతను నిలకడగా రాణించలేకపోతున్నాడు. అయితే చివర్లో ఐడెన్ మార్క్రమ్ (31 నాటౌట్), హిమ్మత్ సింగ్ (40 నాటౌట్) ధాటిగా ఆడటంతో లక్నో స్కోరు 200 దాటింది. ముంబై బౌలర్లలో రఘు శర్మ తన 4 ఓవర్ల కోటాను పూర్తి చేసి ఒక వికెట్ తీశాడు. లక్నో టీమ్ కి కేవలం నాలుగు పాయింట్లు మాత్రమే ఉన్న నేపథ్యంలో ఈ మ్యాచ్ గెలవడం వాళ్లకు చాలా ముఖ్యం.

# డికాక్ డ్రెస్సింగ్ రూమ్‌లో నన్ను తిట్టాడు




**ముంబై ఇండియన్స్ స్టార్ ఓపెనర్ ర్యాన్ రికెల్టన్**

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ స్టార్ ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించిన తర్వాత ఆయన ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. తాను సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నందుకు తన సహచర ఆటగాడు, దక్షిణాఫ్రికా దిగ్గజం క్వింటన్ డికాక్ తనను డ్రెస్సింగ్ రూమ్‌లో తిట్టాడని సరదాగా చెప్పుకొచ్చాడు. అయితే ఇది కోపంతో అన్న మాటలు కాదని.. తమ మధ్య ఉన్న గాఢమైన స్నేహానికి గుర్తు అని ఆయన స్పష్టం చేశారు. ఈ సీజన్లో ముంబై ఇండియన్స్ జట్టు విదేశీ ఆటగాళ్ల ఎంపిక విషయంలో తీవ్రమైన పోటీని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ర్యాన్ రికెల్టన్, క్వింటన్ డికాక్ ఇద్దరూ ఒకే ఓపెనింగ్ స్థానం కోసం పోటీ పడుతున్నారు. సీజన్ ఆరంభంలో డికాక్ లాంటి మేటి ఆటగాడు బెంచ్‌పై ఉండటం వల్ల తాను మానసిక ఒత్తిడికి గురయ్యానని ర్యాన్ రికెల్టన్ అంగీకరించారు. ప్రపంచమంతా క్వింటన్ డికాక్ ను ఆడించాలని కోరుతున్నప్పుడు ఆ ఒత్తిడి తట్టుకుని రాణించడం సవాలుతో కూడుకున్న పని అని ఆయన పేర్కొన్నారు. అయితే క్వింటన్ డికాక్ చేతికి గాయం కావడంతో ర్యాన్ రికెల్టన్ కు తిరిగి తుది జట్టులోకి వచ్చే అవకాశం దక్కింది. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుపై విజయం తర్వాత ర్యాన్ రికెల్టన్ మాట్లాడుతూ.. "నేను ఈరోజు సెంచరీ చేసే ఛాన్స్‌ను చేజేతులా వదిలేశానని నన్ను తిట్టిన మొదటి వ్యక్తి డికాక్. అతను అన్న మాటతో నేను కూడా ఏకీభవిస్తాను. మా మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంది. మేమిద్దరం ఒకరికొకరు ఎంతో మద్దతుగా ఉంటాం" అని వెల్లడించారు. మైదానంలో పోటీ ఉన్నప్పటికీ.. బయట మాత్రం తామిద్దరం మంచి స్నేహితులమని, డి కాక్ తన ఎదుగుదలకు ఎంతో సహాయం చేస్తున్నాడని రికెల్టన్ ప్రశంసించాడు తిరిగి జట్టులోకి వచ్చిన తర్వాత ర్యాన్ రికెల్టన్ ఆడిన చివరి మూడు ఇన్నింగ్స్‌ల్లో 121.5 సగటుతో 243 పరుగులు సాధించాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 8 మ్యాచ్‌ల్లో 380 పరుగులతో ముంబై ఇండియన్స్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ర్యాన్ రికెల్టన్ స్ట్రైక్ రేట్ 190కి పైగా ఉండటం విశేషం. తన బ్యాటింగ్ శైలిని మెరుగుపరచుకోవడంలో డికాక్ ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తున్నాడని.. నెట్స్‌లో తన బ్యాటింగ్‌ను గమనిస్తూ చిన్న చిన్న మార్పులు సూచిస్తున్నాడని ర్యాన్ రికెల్టన్ కృతజ్ఞతలు తెలిపాడు. వ్యక్తిగతంగా ర్యాన్ రికెల్టన్ రాణిస్తున్నప్పటికీ.. ముంబై ఇండియన్స్ జట్టుకు ఈ సీజన్ ఏమాత్రం కలిసిరావడం లేదు. 10 మ్యాచ్‌లు ఆడిన ముంబై కేవలం 6 పాయింట్లతో పట్టికలో 9వ స్థానంలో ఉంది. సమీకరణాలు చూస్తే ముంబై ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి దాదాపు నిష్క్రమించినట్లే. మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లోనైనా గెలిచి గౌరవప్రదంగా సీజన్‌ను ముగించాలని ఆ జట్టు భావిస్తోంది. విదేశీ ఆటగాళ్లు రాణిస్తున్నా, భారతీయ ఆటగాళ్లు విఫలం కావడం ముంబై కొంపముంచిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఢిల్లీ మ్యాచ్‌కు ఎంఎస్ ధోనీ దూరం!

**బలగం టీవి, హైదరాబాద్**




ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు ఒక బ్యాడ్ న్యూస్. టీమ్ స్టార్ ప్లేయర్, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఇంకా పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ సాధించలేదు. మంగళవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరగబోయే మ్యాచ్‌కు అతను అందుబాటులో ఉండటం లేదు. ఈ విషయాన్ని సిఎస్‌కే బౌలింగ్ కన్సల్టెంట్ ఎరిక్ సైమన్స్ ప్రీ-మ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అధికారికంగా వెల్లడించాడు. ధోనీ కాఫ్ ఇంజూరీ నుంచి కోలుకుంటున్నాడని, అయితే ప్రస్తుతానికి అతను టీమ్‌తో కలిసి ఢిల్లీకి ప్రయాణించలేదని సైమన్స్ క్లారిటీ ఇచ్చాడు. ధోనీ ఎప్పుడు ఆడతాడు అనే విషయంపై అడిగిన ప్రశ్నకు సైమన్స్ ఇంట్రెస్టింగ్ ఆన్సర్ ఇచ్చాడు. ధోనీ అప్‌డేట్ ఇవ్వడం తన స్థాయికి మించిన విషయమని, అతను ప్రస్తుతం తమతో లేడు కానీ క్రమంగా కోలుకుంటున్నాడని తెలిపాడు. ఎప్పుడు సిద్ధంగా ఉండాలో అతనికి బాగా తెలుసని, సిద్ధంగా ఉన్నప్పుడు ఖచ్చితంగా బరిలోకి దిగుతాడని సైమన్స్ పేర్కొన్నాడు. ధోనీ ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. గతేడాది మే 25న గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్ తర్వాత అతను మళ్ళీ ఐపీఎల్ గ్రౌండ్ లో కనిపించలేదు. ధోనీ రాక కోసం కోట్లాది మంది ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. అతను గ్రౌండ్ లోకి అడుగుపెడితే ఆ జోష్ వేరే లెవల్ లో ఉంటుంది. ఢిల్లీతో జరిగే ఈ మ్యాచ్ సిఎస్‌కే కి చాలా కీలకం కానుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదుసార్లు ఛాంపియన్ అయిన సిఎస్‌కే ఆరో స్థానంలో ఉంది. ఆడిన తొమ్మిది మ్యాచుల్లో కేవలం నాలుగు విజయాలు మాత్రమే అందుకుంది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే మిగిలిన మ్యాచుల్లో కనీసం నాలుగు విజయాలు సాధించాల్సి ఉంటుంది. ఇలాంటి టఫ్ సిట్యువేషన్ లో ధోనీ లేకపోవడం జట్టుకు ఒక లోటు అని చెప్పాలి. అయితే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మళ్ళీ ఫామ్‌లోకి రావడం టీమ్ కు పెద్ద రిలీఫ్ ఇచ్చింది. గత రెండు మ్యాచుల్లో అతను 74, 67 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును ముందుండి నడిపిస్తున్నాడు.కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ బ్యాటింగ్ స్టైల్ పై ఎరిక్ సైమన్స్ ప్రశంసల వర్షం కురిపించాడు. బ్యాటింగ్ మధ్య లో తాను చాలా ఏకాంతగా, తపస్సు చేసినట్లు ఆడతాడని, చాలా ప్రశాంతంగా కనిపిస్తూనే వికెట్లు కష్టంగా ఉన్నప్పుడు పోరాడుతాడని పేర్కొన్నాడు. మంచి వికెట్ల మీదే కాకుండా కష్టమైన పిచ్ లపై పరుగులు చేయడమే ఒక క్వాలిటీ బ్యాటర్ లక్షణమని, అతను కేవలం 22 బంతుల్లో 50 పరుగులు చేసినా సరే ఎవరూ నోటీస్ చేయలేనంత క్లీన్ గా అతని ఆట ఉంటుందని పేర్కొన్నాడు.. నాయకుడిగా అతనిపై తమకు ఎప్పుడూ నమ్మకం ఉందని, ఇప్పుడు రన్స్ కూడా రావడం చాలా సంతోషమని సైమన్స్ వివరించాడు.జట్టులో సంజు శాంసన్, ఉర్విల్ పటేల్, కార్తీక్ శర్మ వంటి వారు మంచి ఫామ్ లో ఉన్నప్పటికీ.. శివమ్ దూబే, డెవాల్డ్ బ్రెవిస్ ఇంకా ఆశించిన స్థాయిలో రాణించట్లేదు. దూబే ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో 150 రన్స్ చేసి కాస్త తడబడుతున్నాడు. అలాగే సైడ్ స్ట్రెయిన్ కారణంగా కొన్ని మ్యాచులకు దూరమైన బ్రెవిస్, ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచుల్లో కేవలం 64 పరుగులే చేశాడు. వీరిద్దరి గురించి సైమన్స్ మాట్లాడుతూ.. వాళ్లకు ఎటువంటి సమస్య లేదని, ఈ టోర్నీలో టాప్ ప్లేయర్లు కొన్నిసార్లు ఇబ్బంది పడటం సహజమని అన్నాడు. వారు చాలా ఎక్స్ పీరియన్స్ ఉన్న క్రికెటర్లని, వాళ్ల క్వాలిటీ ఏంటో తమకు తెలుసని, ఏ క్షణంలోనైనా వాళ్ల ఫామ్ లోకి వచ్చి మ్యాచ్ ను మలుపు తిప్పగలరని ధీమా వ్యక్తం చేశాడు.

# వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయవద్దు

**ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్**

**బలగం టీవి, హైదరాబాద్**




రోజురోజుకు పెరిగిపోతున్న పట్టణీకరణ నేపథ్యంలో పలు నిర్మాణాలతో పాటుగా కూల్చివేత వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్ తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న ఈ వ్యర్థాలు ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ పరిసరాల్లో, చెరువులు, కుంటలు, నాలాలు ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారని, ఐకియా ప్రాంతంలోని పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాల గుట్టను తొలగించాలంటే సుమారు 60 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ప్రజలు నిర్లక్ష్యంతో వేస్తున్న ఈ నిర్మాణ వ్యర్థాల వలన పర్యావరణ కాలుష్యం పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డెవలప్ మెంట్, స్పోర్ట్స్ డిపార్టుమెంటు సహకారంతో గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో బుధవారం ఏర్పాటుచేసిన రివైజ్డ్ కన్‌స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్ వేస్ట్ మేనేజిమెంట్ రూల్స్‌పై జరిగిన వర్క్ షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న సుమారు 8 వేల టన్నుల చెత్తలో 1700 టన్నుల చెత్త కేవలం నిర్మాణ వ్యర్థా లైన కాంక్రీట్, మట్టి, ఇసుక, గ్రావెల్, ఇటుకలు, పింగాణీ కలప, లోహాలు, ప్లాస్టిక్, పైపులు, టైల్స్ ఉంటున్నాయని, ఒక టన్ను చెత్త రవాణాకు ప్రభుత్వం రెండు వేలు ఖర్చు చేస్తున్న విషయాన్నీ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. వేస్ట్ టు వెల్త్ దిశగా ప్రభుత్వం కషి చేస్తున్నప్పటికీ, నిర్మాణ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే ప్లాంట్స్ ఇంకా ఎక్కువ అవసరమన్నారు. ప్రతీ ప్రభుత్వ టెండర్‌లో 20 నుంచి 25 శాతం నిర్మాణ వ్యర్థాల రీ సైక్లింగ్ మెటీరియల్ వాడే విధంగా చర్యలు తీసుకోనున్నట్టు ఆయన తెలిపారు. హైదరాబాద్ నగరం 2047 నాటికి నెట్ జీరో నగరంగా ఉండాలని ఇటీవల జరిగిన గ్లోబల్ సమిట్‌లో ముఖ్యమంత్రి నిర్ణయించారని, ప్రతీ పౌరుడు, కాలుష్య నివారణ తన బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఉదయం జరిగిన సమావేశంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నేషనల్ ఛైర్మెన్ సీ. శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మెట్రో స్టేషన్స్, ఐటీ బిల్డింగ్స్, తదితర భారీ నిర్మాణాల్లో గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ కోసం రూపొందించిన 32 రేటింగ్స్‌ను తాము పరిశీలిస్తామన్నారు. నిర్మాణ వ్యర్థాలను పరిశీలించి సర్టిఫైడ్ చేసే ఒక సంస్థ తప్పనిసరిగా అవసరమన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ తెలంగాణ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ వికసిత భారత్ లక్ష్యంగా ప్రభుత్వానికి, రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీ సమన్వయ కర్తగా పనిచేస్తున్న తమ సంస్థ పలు నిర్మాణాల పనితీరును పరిశీలిస్తుందని, నిర్మాణ వ్యర్థాల కొత్త రూల్స్ 1 మార్చ్, 2026 నుండి అమల్లోకి వచ్చాయన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర్ రావు వర్క్‌షాప్ ప్రాధాన్యతను వివరిస్తూ, ఇల్లీగల్ డంపింగ్‌ను నివారించడానికి, రెగ్యులర్ మానిటరింగ్ మేనేజమెంట్ అవసరమన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనర్ కమిషనర్ రఘు ప్రసాద్ కన్‌స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్ ప్రాధాన్యతపై సమగ్ర వివరణతో కూడిన ప్రెసెంటేషన్ ఇచ్చారు. నగరంలోని ఫతుల్లాగూడ, జీడిమెట్ల, శంషాబాద్, తూముకుంటలో రోజుకు 500 టన్నుల నిర్మాణ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసే ప్లాంట్స్ ఉన్నాయని, మరిన్ని ప్లాంట్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసే యోచనలో ఉందన్నారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ రిటైర్డ్ ఎక్సిక్యూటివ్ ఇంజినీర్ కోటేశ్వర్ రావు, సోమ శ్రీనివాస్ రెడ్డి ఇంజినీర్ అండ్ కాంట్రాక్టర్స్ డైరెక్టర్ సోమ శశాంక్ రెడ్డి, డెలాయిట్ సీ అండ్ డీ అధికారి అరవింద్ ప్రెజెంటేషన్స్ ఇచ్చారు. ఈ వర్క్ షాప్‌లో జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటుగా, హైడ్రా, హెచ్.ఎం.డిఏ లో పనిచేస్తున్న పలువురు ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్కీలోని సెంటర్ ఫర్ క్లయిమేట్ చేంజ్ డివిజన్ హెడ్ డాక్టర్ చంద్రకళ, ఫ్యాకల్టీ అది నరేష్ కార్యక్రమ సమన్వయ కర్తలుగా వ్యవహరించారు.

# ఎస్ఎఫ్ఏలతో పారిశుధ్యంపై ఎంఎంసీ కమిషనర్ సమీక్ష

**బలగం టీవి, హైదరాబాద్**

నగరంలోని పారిశుధ్యంపైనే ప్రధానంగా దష్టి సారించినట్టు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కష్ణారెడ్డి తెలిపారు. బుధవారం తార్నాకలోని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉప్పల్ జోన్ పరిధిలోని శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్‌తో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, అమలు చేయాల్సిన కీలక అంశాలపై విస్తతంగా చర్చించి, స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. సాట్ వాహనాలు సంబంధిత ఎస్సీటీపీలకు ఖచ్చితంగా లింక్ అయి, రోజువారీ ట్రిప్స్‌పై ఖచ్చితమైన మానిటరింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఎస్సీటీపీ వద్ద రోజుకు జరిగే ట్రిప్స్ సంఖ్యను రికార్డు చేసి, పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. సిబ్బంది హాజరు, ఇంటింటికి వెళ్లి వ్యర్థాల సేకరణ, స్వీపింగ్ పనులు పూర్తిస్థాయిలో అమలు కావాలనీ, ముఖ్యంగా స్వీపర్ల హాజరు శాతాన్ని పెంచి గైర్హాజరు సమస్యను తగ్గించేందుకు క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరగాలని తెలిపారు. శానిటేషన్ సిబ్బందిని ఇతర విభాగాల పనులకు వినియోగించరాదనీ, అత్యవసర పరిస్థితి అయితేనే జోనల్ కమిషనర్ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. రోడ్లపై ఏర్పడే చిన్న చెత్త కుప్పలను వెంటనే జీవీపీ పాయింట్లకు తరలించి, ప్రతి రోజూ వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్ మార్జిన్లు పూర్తిగా శుభ్రంగా ఉండేలా చూసుకోవడంతో పాటు, మార్జిన్ లెవెలింగ్ పనులను సమాంతరంగా నిర్వహించాలని సూచించారు. సాట్ ఆటోల్లో పని చేస్తున్న సిబ్బంది వివరాలు, స్వీపర్ల పూర్తి సమాచారం ప్రతి ఎస్ఎఫ్ఏల వద్ద అందుబాటులో ఉండాలనీ, తరచూ గైర్హాజరవుతున్నవారు, దీర్ఘకాలంగా హాజరు కానివారి జాబితాను ప్రత్యేకంగా నమోదు చేయాలని తెలిపారు. తమ పరిధిలో ఉన్న అన్ని జీవీపీ పాయింట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కూడా సూచించారు. మరో 20 రోజుల అనంతరం జోనల్ వారీగా ఏఈలు, డీఈలు, డీసీలు, ఎస్ఎఫ్ఏలతో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు.

# సల్మాన్ మూవీలో విలన్‌గా అక్షయ్ ఖన్నా ?



బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో వంశీ పైడిపల్లి సినిమా తీయనున్న విషయం తెలిసిందే. ఎస్‌విసి63' అనే టైటిల్‌తో ప్రచారంలో ఉంది. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త ప్రస్తుతం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. ఈ కండల వీరుడితో ఢీ కొట్టేందుకు విలన్ పాత్ర కోసం ఇద్దరి పేర్లు వినిపిస్తున్నాయి. మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్, బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా ఈ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు ఏమాత్రం తగ్గకుండా నటనలో ఆయనకు గట్టి పోటీ ఇచ్చే విలన్ ఉండాలని చిత్ర బృందం భావిస్తోందట. అందుకే ఈ ఇద్దరిలో ఒకరిని ఫైనల్ చేసే దిశగా చర్చలు జరుగుతున్నాయి. ప్రముఖ నిర్మాత దిల్ రాజు అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2027 ఈద్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఇందులో సల్మాన్‌కు జోడీగా అగ్ర కథనాయిక నయనతార నటిస్తుండగా.. సీనియర్ నటుడు అరవింద్ స్వామి ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ముంబయిలో దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. నయనతార కూడా ఈ తాజా షెడ్యూల్‌లో పాల్గొన్నారు. సల్మాన్ ఖాన్ మాస్ ఇమేజ్‌కు వంశీ పైడిపల్లి స్టైలిష్ టేకింగ్ తోడైతే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

# ది ప్యారడైజ్ నుంచి మరో పాట విడుదలకు రెడీ



'ది ప్యారడైజ్' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేం దుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు నాని. ఆయన నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి బయటకొచ్చిన ఆయా షేర్. పాటకి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇందులోని రెండో గీతాన్ని విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. మే రెండో వారంలో దీన్ని బయటకు వదలనున్నారని.. ఇదో ప్రేమ గీతంగా ఉండనుందని సమాచారం. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమాని ఆగస్టు 21న థియేటర్లలోకి తీసుకు రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీనికి తగ్గట్లుగానే మే చివరి నాటికి చిత్రీకరణ పూర్తి చేయాలన్న లక్ష్యంతో చిత్ర బృందం షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# లెనిన్ మూవీలో భాగ్యశ్రీ లుక్




'లెనిన్'లో అఖిల్‌తో కలిసి సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా టీమ్ ఓ స్పెషల్ పోస్టర్‌తో ఆమెకు శుభాకాంక్షలు తెలిపింది. ఈ సినిమాలో ఆమె భారతి అనే పాత్రలో అలరించనున్నారు. తాజాగా పంచుకున్న పోస్టర్‌లో ఆమె పౌరాణిక లుక్‌లో రాచరికపు దుస్తులు, భారీ ఆభరణాలు ధరించి కనిపించారు. తీక్షణమైన చూపులతో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే ఆమె పాత్ర చాలా శక్తిమంతంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ సినిమా వాయిదా పడనుందంటూ వార్తలు రాగా నాగార్జున తన పోస్ట్‌తో వాటిని ఖండించారు. అనుకున్న తేదీ ప్రకారం జూన్ 26న ఈ సినిమా విడుదల కానున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో కొత్త అఖిల్‌ను చూస్తారని హామీ ఇచ్చారు. తాను ఫస్ట్ కట్ చూశానని అది చూశాకే నమ్మకంతో చెబుతున్నానన్నారు. చిత్తూరు నేపథ్యంలో సాగే కథ ఇది. బలమైన భావోద్వేగాలు, ఆసక్తిని రేకెత్తించే కథనంతో ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచేలా 'లెనిన్' చిత్రం రూపుదిద్దుకొంటోంది.




# నితిన్ కొత్త సినిమా పూజా కార్యక్రమంతో ప్రారంభరం



యంగ్ హీరో నితిన్ కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై రూపొందుతున్న తాజా చిత్రం నేడు అత్యంత వైభవంగా ప్రారంభమైంది. పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైన ఈ చిత్ర ప్రారంభోత్సవానికి చిత్ర యూనిట్ సభ్యులు హాజరై సందడి చేశారు. ఈ సినిమా ద్వారా సోము నర్రి దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతుండగా, 'అశోకవనంలో అర్జున కళ్యాణం' ఫేమ్ రితికా నాయక్ నితిన్ సరసన కథానాయికగా నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఇతర పనులు పూర్తి చేసుకుని, మే రెండో వారం నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోనుంది. వరుస విజయాలతో జోరు మీదున్న సితార సంస్థ ఈ సినిమాతో నితిన్‌కు ఒక భారీ కమర్షియల్ సక్సెస్‌ను అందించేందుకు సిద్ధమైంది. త్వరలోనే ఈ చిత్ర టైటిల్ మరియు పూర్తి నటీనటుల వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు.

# 600 కోట్ల భారీ బడ్జెట్‌తో రజనీ , కమల్ మూవీ

దక్షిణాదిలో మాత్రమే కాకుండా మొత్తం భారతీయ సినీ పరిశ్రమలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారిన భారీ ప్రాజెక్ట్ ఏదైనా ఉందంటే అది సూపర్ స్టార్ రజనీకాంత్, విశ్వనటుడు కమల్ హాసన్ కలిసి నటించబోతున్న మల్టీస్టారర్ సినిమా. ఈ చిత్రాన్ని ప్రతిభావంతుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమాపై భారీ స్థాయిలో అంచనాలు నెలకొనగా, తాజాగా వినిపిస్తున్న వార్తలు మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. సినీ వర్గాల్లో ప్రచారం ప్రకారం ఈ సినిమాకు సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్ కేటాయించినట్టు సమాచారం. ఇది నిజమైతే భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ఖరీదైన చిత్రాలలో ఒకటిగా నిలిచే అవకాశముంది. ఈ భారీ వ్యయంలో ఎక్కువ భాగం ప్రధాన నటులు మరియు సాంకేతిక బృందం పారితోషికాలకే వెళ్తున్నట్టు తెలుస్తోంది.ముఖ్యంగా రజినీకాంత్, కమల్ హాసన్ లాంటి దిగ్గజ నటులు ఒకే సినిమాలో నటించడం వల్ల వారి పారితోషికాలు కూడా అత్యంత భారీగా ఉన్నాయని సమాచారం. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కూడా తన విజయాల నేపథ్యంలో మంచి మొత్తాన్ని అందుకుంటున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నది ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ రవిచందర్ కాగా, ఆయన సంగీతం ఈ సినిమాకు మరో ప్రధాన బలం కానుంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను కమల్ హాసన్‌కు చెందిన నిర్మాణ సంస్థ రాజ్ కమల్



ఫిలింస్ ఇంటర్నేషనల్ నిర్మిస్తోంది. అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రం రూపొంద నుం దని సమాచారం. ప్రస్తుతం ముందస్తు పనులు వేగంగా కొనసాగుతుండగా, త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. ఇంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ మల్టీస్టారర్‌ను దర్శకుడు నెల్సన్ ఎలా రూపొందిస్తాడో అన్నది ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. మొత్తానికి రజినీకాంత్ , కమల్ హాసన్ కలయిక, నెల్సన్ దర్శకత్వం, అనిరుధ్ సంగీతం కలిసివచ్చి ఈ సినిమాను భారతీయ సినీ రంగంలో ఒక కొత్త మైలురాయిగా నిలబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# ఎల్లమ్మ మూవీలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్

బలగం' వంటి హృదయాన్ని తాకే ఫ్యామిలీ ఎమోషనల్ చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన దర్శకుడు వేణు యెల్దండి తన రెండో సినిమాతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'ఎల్లమ్మ' అనే ప్రత్యేకమైన టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా హీరోయిన్ ఎంపికపై సాగుతున్న ఉత్కంఠకు ఇప్పుడు తెరపడుతున్నట్లు సమాచారం.తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ సినిమాలో నటనకు అత్యంత ప్రాధాన్యం ఉన్న పాత్ర కోసం దర్శకుడు చాలా జాగ్రత్తగా హీరోయిన్‌ను ఎంపిక చేయాలని భావించారు. ప్రారంభంలో ఈ పాత్ర కోసం సాయి పల్లవిను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. అయితే డేట్స్ సమస్యల కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఆ తరువాత కీర్తి సురేష్ పేరు బలంగా వినిపించింది. ఒక దశలో ఆమె ఎంపిక దాదాపు ఖాయమని కూడా ప్రచారం జరిగింది. వీరితో పాటు శృతి హాసన్, భాగ్యశ్రీ బోర్సే, కన్నడ నటి రుక్మిణి వసంత్ పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చాయి. అయితే తాజా



సమాచారం ప్రకారం 'సీతా రామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ ఈ పాత్రకు దాదాపు ఫైనల్ అయినట్లు ఫిల్మ్ నగర్ వర్గాలు

చెబుతున్నాయి. భావోద్వేగ సన్నివేశాల్లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకునే మృణాల్ ఈ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఇక ఈ చిత్రంలో మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, ఫేమస్ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. 'పార్శి' అనే శక్తివంతమైన పాత్ర లో ఆయన కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో ఆయన లుక్‌కు మంచి స్పందన వచ్చింది. అంతే కాదు, ఈ చిత్రానికి సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తు న్నారు. 'ఎల్లమ్మ' సినిమా తెలంగాణ సంప్రదాయా లు, జానపద కళలు, ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన కథగా రూపొం దుతోంది. గ్లింప్స్‌లో చూపించిన వేప ఆకులు, పసుపు, కుంకుమ, గ్జజెల శబ్దాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచా యి. ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్‌లు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై భారీ బ్జడెట్‌తో నిర్మిస్తు న్నారు. హీరోయి న్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడిన వెంట నే షూటింగ్ పూర్తి స్థాయిలో ప్రారంభం కానుంది. తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల్లోనూ పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.